**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

మంచి మాట మనకు, మర్యాద గొనితెచ్చు
చెడ్డ పలుకు నెపుడు చేటునగును.
మంచి, చెడుల యొక్క మర్మమ్ము తెలుసుకో
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి
-----------------------

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 165 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 20-9-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00



## భారత్ మా ఆఫీసును కూల్చేసింది

- ఆపరేషన్ సింధూర్‌తో మురిద్క్ స్థావరం ధ్వంసం..
- వీడియో షేర్ చేసిన లష్కరే కమాండర్


**ఇస్లామాబాద్ -**
ఆపరేషన్ సింధూర్ దాడి వల్ల పాకిస్థాన్‌లోని బహవల్‌పుర్‌లో ఉన్న జైషే ఉగ్రవాదుల ప్రధాన కార్యాయం ధ్వంసమైనట్లు కొన్ని రోజుల క్రితం జైషే మహమ్మద్ కమాండర్ ఇలియాస్ కశ్మీరీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు చెందిన వీడియో కూడా వైరల్ అయ్యింది. అయితే తాజాగా ఆ వ్యాఖ్యలను సమర్థిస్తూ లష్కరే తోయిబా ఉగ్రసంస్థ కూడా ఓ వీడియోను పోస్టు చేసింది. భారత సైన్యం జరిపిన దాడిలో మురిద్క్‌లో ఉన్న లష్కరే తోయిబా ఉగ్ర స్థావరం ధ్వంసమైనట్లు ఆ ఉగ్ర సంస్థ కమాండర్ ఒకరు తెలిపారు.లష్కరే కమాండ్ ఖాసిమ్.. ఓ కూలిన ఇంటి వద్ద నిలుచుని మాట్లాడుతున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మురిద్క్‌లో శిథిలమైన మర్కాజ్ ఈ తాయిబా క్యాంపు వద్ద అతను తన బాధను పంచుకున్నాడు. ముజాహిదిన్ ఉగ్రవాదులు ఇక్కడే శిక్షణ -మిగతా 2 లో

## సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు

# అసాధ్యం

### కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదు

- కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలకు కవిత బలి
- కాళేశ్వరంపై సిబిఐ విచారణలో కిషన్ రెడ్డి మోకాలడ్డు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- సీఎం తో భేటీ అయిన న్యూజెర్సీ గవర్నర్



**ఎమ్మెల్యేల వ్యవహారం పై స్పీకర్‌దే తుది నిర్ణయం**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక ఎన్నికలు జరపడం కష్టమని తెలిపారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనా స్పందించారు . కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల జీతాల నుంచి రూ.5000లు ఆ పార్టీకే వెళ్తుందని అన్నారు. నిధులు సైతం బీఆర్ఎస్‌కే వెళ్తున్నాయని తెలిపారు. అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ తమకు 37 మంది ఎమ్మెల్యేల బలం ఉందని, సమయం కేటాయించాలని కోరారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. -మిగతా 2 లో




## పాక్‌కు అమెరికా షాక్

- బలూచ్ ఆర్మీని ఉగ్రసంస్థగా ప్రకటించాలన్న అభ్యర్థనను అడ్డుకున్న అగ్రరాజ్యం

**న్యూఢిల్లీ, -**
దాయాది పాకిస్థాన్ కు అగ్రరాజ్యం అమెరికా షాకిచ్చింది. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ , దానికి చెందిన మజీద్ బ్రిగేడ్ ని విదేశీ ఉగ్రవాద సంస్థలుగా గుర్తించాలంటూ యూఎన్ భద్రతామండలిలో చైనా,పాక్ చేసిన అభ్యర్థనను అమెరికా అడ్డుకుంది.బలూచ్ ఆర్మీ, మజీద్ బ్రిగేడ్‌పై ఆంక్షలు విధించాలంటూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో పాక్-చైనా ఉమ్మడి బిడ్‌ను సమర్పించాయి. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. అల్ ఖైదా, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్, బలోచ్ ఆర్మీ, మజీద్ బ్రిగేడ్ సహా పలు ఉగ్రవాద గ్రూపులు ఆఫ్ఘనిస్థాన్ కేంద్రంగా తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఉద్భవిస్తున్న ఉగ్రవాదం పాక్ ప్రాథమిక జాతీయ భద్రతకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ అభ్యర్థన మేరకు ఆ ఉగ్రసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, పాక్-చైనా చేసిన ఈ అభ్యర్థనను యూఎస్, యూకే, ఫ్రాన్స్ అడ్డుకున్నాయి. -మిగతా 2 లో

## ఒక్కరోజులో 404 కేసులను ఎలా విచారిస్తారు?

- కేసులను త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశం మంచిదే
- సమాచార కమిషన్‌ను నిలదీసిన తెలంగాణ హైకోర్టు




**హైదరాబాద్,**
: కేసులను త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశం మంచిదే అయినా ఒకరోజు 404 కేసులను ఎలా విచారిస్తారని సమాచార కమిషన్ ను హైకోర్టు నిలదీసింది. 404 అప్పీళ్లకు సంబంధించిన ఫైళ్లతో పిటిషనర్ ఎలా రాగలరని ప్రశ్నించింది. కేసుల నంబర్లు లేకుండా విచారణకు హాజరు కావాలంటూ ఇచ్చిన నోటీసు చెల్లదని పేర్కొంది. సమాచారం హక్కు చట్టం కింద కోరిన సమాచారానికి సంబంధించి సహా -మిగతా 2 లో

## తుమ్మడిహట్టి పై హరీష్ అబద్దాలు

- అంచనాలే వేయకుండానే బడ్జెట్ లెక్కల
- అతి తెలివితేటలు వద్దని ఉత్తమ్ ఎద్దేవా



**హైదరాబాద్ - సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తుమ్మడిహట్టి బ్యారేజ్, చేవెళ్ల-ప్రాణహిత బ్యారేజ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని,. అయితే ఇప్పటి వరకు అంచనాలపై ఎలాంటి లెక్కలు సిద్ధం చేయలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. దీనిపై అబద్దపు లెక్కలు కట్టిన హరీష్ రవు తీరుపై మంత్రి మండిపడ్డారు. మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తుమ్మడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి రూ.35 వేల కోట్లు ఖర్చు అవుతుందని, 4.47 లక్షల ఎకరాలకు ఆయకట్టు అందుతుందని హరీష్ రావు చేసిన ప్రకటన అసత్యమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితిలో హరీష్ రావు అంచనాలు ఎలా చెబుతారు? -మిగతా 2 లో

# ఎమ్మెల్యేలను దొంగిలించడం నేరం కాదా?

### ఓట్ల చోరీ కంటే ఎమ్మెల్యేల చోరీ పెద్దది



- దమ్ముంటే వారితో రాజీనామాలు చేయించాలి
- రాహుల్ గాంధిది రెండు నాల్కల ధోరణి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఓట్ చోరి కంటే ఎమ్మెల్యేల చోరి పెద్ద నేరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల చోరిపై మాట్లాడకపోవడం రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని.. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయిస్తేనే ఓట్ చోరిపై మాట్లాడే నైతిక అర్హత ఉంటుందన్నారు. ఓట్ చోరీపై గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ పార్టీ చేసిన ఎమ్మెల్యేల చోరీపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఓట్ల చోరీ ఒక నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని, అది ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేయడమేనని -మిగతా 2 లో



## చిక్కుల్లో రాహుల్‌గాంధీ

- ఎన్నికల కమిషనర్‌పై ఆరోపణలు

**న్యూఢిల్లీ, -**
ఓట్ల చోరీపై నిర్వహించిన ప్రెస్ మీట్‌తో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చిక్కుల్లో పడ్డారు. దేశంలో ఓట్ల చోరీపై ఢిల్లీలోని కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఇందిరా భవన్‌లో రాహుల్ విలేకరుల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మీటింగ్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఓటు దొంగలను, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న వ్యక్తులను ఆయన రక్షిస్తున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. కర్ణాటకలోని ఆలంద్, మహారాష్ట్రలోని రజోరా నియోజకవర్గాల్లో ఇలాంటి ఘటనలు -మిగతా 2 లో

## నగరంలో కురుస్తున్న వర్షాలతో అప్రమత్తం

- వచ్చే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులతో మంత్రి పొన్నం టెలీకాన్ఫరెన్స్



**హైదరాబాద్,-**
:నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు.. తీసుకుంటున్న చర్యలపై జిహెచ్ఎంసి, హైడ్రా, పోలీస్, ట్రాఫిక్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్, జిల్లా రెవెన్యూ, విద్యుత్, హెల్త్ వివిధ విభాగాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తుండటం వల్ల ప్రజల ఇబ్బందులు పడుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు విధుల్లో ఉండాలని -మిగతా 2 లో

## ఇండియా, మోదీ నాకు మంచి సన్నిహితులే

- మీడియా సమావేశంలో డోనాల్డ్ ట్రంప్




**లండన్-**
వాణిజ్య యుద్ధం నేపథ్యంలో అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బలహీనపడ్డ విషయం తెలిసిందే. అయితే ప్రధాని మోదీపై మాత్రం ట్రంప్ తన ప్రశంసలను ఆపడం లేదు. ప్రధాని మోదీకి తాను సన్నిహితంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. సెప్టెంబర్ 17వ తేదీన మోదీ బర్త్‌డే సందర్భంగా ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు. ఇండియాకు చాలా దగ్గరగా ఉన్నానని, ప్రధాని మోదీ కూడా తనకు దగ్గరి వ్యక్తే అని, ఫోన్‌లో మాట్లాడి బర్త్‌డే విషెస్ చెప్పినని, తమ మధ్య మంచి సంబంధాలు ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని చెప్పడం గమనార్హం.రష్యా వద్ద ఇంధనం కొంటున్న భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. -మిగతా 2 లో

## కాంగ్రెస్‌లో చేరలేదు, కలిసి పనిచేస్తున్నా..

### రాజకీయాలను కేసీఆర్ భ్రష్టు పాటించారు

- నియోజకవర్గ అభివృద్ధి కోసమే..
- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందెవరు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హైదరాబాద్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఒకరైన స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన కామెంట్స్ చేశారు. హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ బీఅర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 36 మంది శాసన సభ్యులను పార్టీలో చేర్చుకొని అందులో ఇద్దరికీ మంత్రి పదవి కూడా ఇచ్చారని కడియం శ్రీహరి గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో -మిగతా 2 లో

## భారత్ మా ఆఫీసును కూల్చేసింది

(మొదటి తరువాయి)

పొందినట్లు అతను స్పష్టం చేశాడు. మర్కాజ్ తాయిబా ముందు నిలుచున్నానని, ఆపరేషన్ సింధూర్ దాడిలో ఇదిధ్వంసమైందని, మళ్లీ దీన్ని నిర్మిస్తామని, మరింత పెద్దగా కడుతామని, ముజాహిద్దీన్‌లో ఎక్కువ మంది ఇక్కడే శిక్షణ పొందారని, వాళ్లు విజయం సాధించారని లష్కరే కమాండర్ పేర్కొన్నారు. దైరా–ఈ–సూపా కార్యక్రమం కింద యువత తమ దళంలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. పంజాబ్ ప్రావిన్సులోని నంగల్ సహదాన్‌లో 2000 సంవత్సరంలోమార్కాజ్ తాహిబాను నిర్మించారు. వరద సహాయం పేరుతో లష్కరే తోయిబా నిధులను సమీకరిస్తున్నది. హాఫీజ్ సయిద్ నేతృత్వంలో ఈ ఫండ్ కలెక్షన్ జరుగుతున్నట్లు కొన్ని సంస్థల ద్వారా తెలుస్తోంది.

## పాక్‌కు అమెరికా షాక్

(మొదటి తరువాయి)

ఈ గ్రూపులను ఉగ్ర సంస్థలుగా గుర్తించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొన్నాయి.కాగా, పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ పర్యటన వేళ.. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ , దానికి చెందిన మజీద్ బ్రిగేడ్ ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా గుర్తిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. బీఎల్ఏని 2019లోనే.. 'స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ)' జాబితాలో చేర్చిన అమెరికా.. మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్ఏలో భాగంగానే భావిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో గతనెల కీలక ప్రకటన చేశారు.ఇటీవలే కాలంలో బీఎల్ఏకు చెందిన మజీద్ బ్రిగేడ్ పాక్‌లోని పలు ప్రాంతాల్లో వరుస దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. పాక్ సైన్యమే లక్ష్యంగా ఆత్మాహుతి దాడులు నిర్వహిస్తోంది. 2024లో కరాచీ ఎయిర్‌పోర్ట్, గ్వాదర్ పోర్ట్ అథారిటీపై బీఎల్ఏ దాడులు చేపట్టింది. ఇక ఈ ఏడాది అంటే 2025లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ చేసి దాదాపు 300 మంది ప్యాసింజర్లను బందీలుగా చేసుకుంది. పాక్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి వారిని విడిపించింది. ఈ రైలు హైజాక్ ఘటనలో 31 మంది పౌరులు, పాక్ సైనికులు చనిపోయారు. ఇలా వరుస దాడులతో బలూచ్ ఆర్మీని ఉగ్రసంస్థగా గుర్తించాలని పాక్ కోరుతూ వస్తోంది.

### ఒక్కరోజులో 404 కేసులను
## ఎలా విచారిస్తారు?

(మొదటి తరువాయి)

కార్యకర్త వి.శ్యామ్ కమిషన్ ముందు 404 అప్పీళ్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై విచారణకు వివరాలతో ఈ నెల 18న హాజరు కావాలని కమిషన్ నోటీసులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ శ్యామ్ గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ టి.మాధవీ దేవి విచారించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ పోస్టు ఏడాదిన్నర పాటు ఖాళీ ఉండటంతో 17 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పిటిషనర్ 404 అప్పీళ్లు దాఖలు చేయగా, మరో ఇద్దరు 980, 832 చొప్పున దాఖలు చేశారన్నారు. వీటిలో కొన్నింటిని గడువులోగా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అందులో భాగంగానే పిటిషనర్‌కు నోటీసు జారీ చేశారని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఒకేరోజు 404 కేసులపై విచారణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ నెల 11న ఇచ్చిన నోటీసును రద్దు చేస్తున్నామని, కేసుల వివరాలతో తాజాగా ఇవ్వాలని కమిషన్‌కు ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది.స.హ.చట్టం కింద సమాచారం కోసం ముగ్గురు అర్జీదారులు అప్పిలేట్ అథారిటీకి వందల కొద్దీ దరఖాస్తులు సమర్పించారు. పురపాలక, ఆర్థిక, రెవెన్యూ శాఖల్లో వేసినట్లు రాష్ట్ర సమాచార కమిషన్ గుర్తించింది. స.హ.చట్టం కింద సరైన సమాచారం రాకుంటే అప్పిలేట్ అథారిటీకి దరఖాస్తు చేయొచ్చు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులు వేర్వేరు జిల్లాల్లోని పలు విభాగాల పరిధిలో దాదాపు 2,500 దరఖాస్తులు చేశారు. గురువారం ఇక్కడ ఆర్టీఐ కార్యాలయంలో ప్రధాన సమాచార కమిషన్ నేతృత్వంలోని ఐదుగురు కమిషనర్ల ఆధ్వర్యంలోని పూర్తిస్థాయి బెంచ్ వీటిపై విచారించింది. 2023 చివరి వరకు శ్రీనివాస్ రెడ్డి ఆర్థికశాఖ బడ్జెట్, ఖర్చుల వివరాలపై సమాచారం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మరో దరఖాస్తుదారుడు వడ్డే శ్యామ్ పురపాలక శాఖ చార్మినార్ జోన్ పరిధిలో ఎన్ని భవనాలకు నిర్మాణ అనుమతులిచ్చారు? ఎందరికి నివాస యోగ్యతపత్రాలు మంజూరు చేశారన్న విషయాలపై సమాచారం కోరినట్లు వివరించింది. మహ్మద్ అష్రఫ్ పాఠశాల విద్య, హోం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమాచారం అడిగారని పేర్కొంది.

## తుమ్మడిహట్టిపై హరీష్ అబద్దాలు

(మొదటి తరువాయి)

ఇది ఆయన అతితెలివి తేటలకు అద్దం పడుతున్నట్లే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హరీష్ రావు చేస్తున్న 35 వేల కోట్ల వ్యయం, 4.47 లక్షల ఎకరాల ఆయకట్టు– ప్రకటనలు అవాస్తవమని, ఇవి పూర్తిగా ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశ్యంతోనే చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసిన వెంటనే అధికారికంగా ప్రకటిస్తుంది. కానీ హరీష్ రావు లాంటి నేతలు అసత్య ప్రచారం చేయడం తగదు. తెలంగాణ సమాజం ఇలాంటి వ్యాఖ్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి' అని మంత్రి హెచ్చరించారు. తన ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందని, ముఖ్యంగా రైతు సంక్షేమం పట్ల కట్టు–బడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. సాగునీరు, త్రాగునీరు అందించేందుకు ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని ఆయన తెలిపారు.

## చిక్కుల్లో రాహుల్‌గాంధీ

(మొదటి తరువాయి)

జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రెస్ మీట్‌లో ఓట్లు ఎలా చోరీకి గురవుతున్నాయో వివరిస్తూ ఓ ఫోన్ నంబర్‌ను రాహుల్ ప్రదర్శించారు. అది ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అంజనీ మిశ్రా అనే వ్యక్తి ఫోన్ నంబర్. రాహుల్ ప్రెస్ మీట్ తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ కాల్స్ వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై అంజనీ మిశ్రా అసహనం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రెస్ మీట్ తర్వాత దేశం నలుమూలల నుంచి నిరంతరాయంగా కాల్స్ వస్తున్నట్లు చెప్పారు. ఆ ఫోన్ నంబర్‌ను తాను 15 ఏళ్లుగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాదు ఓటరు తొలగింపుకు సంబంధించి తాను ఎలాంటి దరఖాస్తు చేయలేదని వివరించారు. ప్రెస్ బ్రీఫింగ్‌లో రాహుల్ తన నంబర్‌ను ప్రస్తావించడం చూసి షాక్ అయినట్లు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అంజనీ మిశ్రా మీడియాకు తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

## ఇండియా, మోదీ నాకు మంచి సన్నిహితులే

(మొదటి తరువాయి)

భారతీయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను అమెరికా 50 శాతానికి పెంచడంతో రెండు దేశాల మధ్య ప్రచ్ఛన్న వాణిజ్య యుద్ధం సాగుతోంది. అయితే ద్వైపాక్షిక చర్చల ద్వారా వాణిజ్య సమస్యలను పరిష్కరించుకోనున్నట్లు చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్ తెలిపారు.

# సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు అసాధ్యం

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలకు సంబంధించిన పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలు ఉన్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తును కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీ–ఆర్, హరీష్ రావు, సంతోష్ రావు కలిసి ఒక ఆడపిల్ల (కవిత)పై దాడి చేయాలని చూస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇది వారి కుటుంబ సమస్య అని, దీనికి తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నేను ఎక్కడా కవితకు సపోర్ట్ చేయడం లేదు. ఇది వారి ఇంటి సమస్య. ఆస్తి తగాదాల వల్ల వారి కుటుంబ సమస్యలు బజారున పడ్డాయి. ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని తిరస్కరించారు. ఆ నలుగురిని తెలంగాణ ప్రజలు బహిష్కరించారని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు చేయిస్తామని గతంలో కిషన్ రెడ్డి చెప్పారని, కానీ ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని సీఎం రేవంత్ ప్రశ్నించారు. సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో దర్యాప్తు జరుపుతామని కిషన్ రెడ్డి గతంలో చెప్పారు. కానీ ఇప్పటివరకు ఎందుకు మాట్లాడటం లేదు? కేటీఆర్ ఏం చెబితే కిషన్ రెడ్డి అది చేస్తారు. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే అన్ని వివరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ కేసు నుంచి సీబీఐ మొదటి నుంచి దర్యాప్తు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తే అన్ని వివరాలు బయటకు వస్తాయి. కాళేశ్వరం సీబీఐ విచారణ జరపకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో రైలుపై మాట్లాడుతూ, ఎల్ అండ్ టి తీసుకునే నిర్ణయాలపై ప్రభుత్వం ఆలోచిస్తుందని చెప్పారు. 'ఎల్ అండ్ టి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో ఒప్పందం కుదుర్చుకోవాలని చెబుతోంది. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం బయటకు పోతుందని ఎక్కడ చెప్పలేదని రేవంత్ రెడ్డి అన్నారు. డ్రగ్స్ నియంత్రణకు తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



మా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డ్రగ్స్‌ను కంట్రోల్ చేస్తున్నాం. మా ఈగల్ టీం గోవా వెళ్లి డ్రగ్స్‌తో సంబంధం ఉన్నవారిని పట్టుకుంది. హైదరాబాద్‌లో దొరికిన డ్రగ్స్ తయారీ కంపెనీ గత ప్రభుత్వంలోనే ఏర్పడింది. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్‌తో దొరికారని ఆరోపించారు. 2014–19 మధ్య టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేరని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, చట్టసభల్లో, లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు– కాదు. హరీష్ రావే మాకు 37 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అసెంబ్లీలో చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రాష్ట్రానికి 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ప్రస్తుతం 2 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉంది. బీజేపీ, టీఆర్ఎస్ ఈ విషయంలో రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. నక్సలైట్లు– లొంగిపోవడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాలసీలు తీసుకొచ్చాయని చెప్పారు. –టెర్రరిస్టులతో చర్చలు జరపడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పుడు, నక్సలైట్లతో చర్చలు చెప్పడానికి ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. లోకేష్ నాకు తమ్ముడు లాంటివాడు అని కేటీఆర్ చెప్పారు. మరి తమ్ముడు లోకేష్ తండ్రిని జైల్లో పెట్టినప్పుడు కేటీఆర్ ఎక్కడ ఉన్నాడని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి తెలంగాణ ప్రాధాన్యత రంగాలను వివరించారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి ప్రైవేటు– రంగం మద్దతు గురించి తెలిపారు. అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ 2047' రూపొందించుకున్నట్లు– చెప్పారు. హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నగరంలో ఆర్ఆర్ఆర్ కూడా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు విస్తరిస్తున్నాం. మెట్రోలో ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్యను 15 లక్షలకు పెంచాలనేదే మా లక్ష్యం. గుజరాత్‌లోని సబర్మతీ తీరంలా మూసీ తీరాన్ని అభివృద్ధి చేస్తాం. దీనికోసం మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ వెలుపలకు తరలిస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం అన్నారు.

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి కనెక్టివిటీ– ఏర్పాటు– చేస్తాం. హైదరాబాద్–బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం. డ్రగ్స్ కట్టడిలో మా రాష్ట్ర పోలీసులు దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నారు. 2034 కల్లా ట్రిలియన్ డాలర్ల, 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది మా లక్ష్యం. దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచే రావాలనేది మా ధ్యేయం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో న్యూజెర్సీ గవర్నర్ పిలిప్ డి.మూర్ఫీ ఢిల్లీలో శుక్రవారం భేటీ–అయ్యారు.

# నగరంలో కురుస్తున్న వర్షాలతో అప్రమత్తం

(మొదటి తరువాయి)

ఆదేశలు జారీ చేశారు. లోతట్టు– ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందుల గురించి పిర్యాదులు చేస్తే వెంటనే స్పందించాలని ఆదేశించడం జరిగింది . ప్రజలు పిర్యాదు చేసే టోల్ ఫ్రీ నెంబర్‌లను.. టీ–వీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలిసేలా చేయాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించడం జరిగింది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వాహనదారులు జాగ్రత్తగా వెళ్లేలా అక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు–చేయాలని తెలపారు. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు పోవడానికి మ్యాన్ హోల్‌లు ఉండేలా చూసుకోవాలని.. ప్రమాదాలు జరగకుండా అక్కడ జిహెచ్ఎంసి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. విద్యుత్ స్తంభాల, విద్యుత్ తీగల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ మొబైల్ మెసేజ్‌ల రూపంలో సందేశాలు పంపాలని ఆదేశించారు. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు అత్యవసరం అయితేనే బయటకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని అధికారులకు సూచించి, తాగునీటి సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచి నీటి నాణ్యతను పరీక్షించాలలని పేర్కొన్నారు. ఎక్కడ తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. బస్తీలు.. లోతట్టు–ప్రాంతం మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగర ప్రజలు ఇలాంటి పరిస్థితులలో మ్యాన్ హోల్ మూతలు తెరవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. హైడ్రా, జిహెచ్ఎంసి, పోలీసు, ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలి అని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# ఎమ్మెల్యేలను దొంగిలించడం నేరం కాదా?

(మొదటి తరువాయి)

మండిపడ్డారు. రాహుల్ గాంధీకి సిగ్గు,శరం ఉంటే బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పుడే ఆయనకు ఓట్ల చోరీ గురించి మాట్లాడే నైతిక అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పి, గల్లీలో అదే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి వెన్నతో పెట్టిన విద్య అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని దేశమంతా తిరుగుతూ ఈవీఎంల ట్యాంపరింగ్, ఓట్ల దొంగతనం గురించి ఉపన్యాసాలు ఇస్తున్న రాహుల్ గాంధీకి, తెలంగాణలో ఆయన పార్టీ చేస్తున్న ఎమ్మెల్యేల దొంగతనం కనిపించకపోవడం కాంగ్రెస్ పార్టీ డిఎన్ఏలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలకు , రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం అని విమర్శించారు.బీఆర్ఎస్ సిద్ధాంతాలు కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసించి తెలంగాణ ప్రజలు గెలిపించిన పది మంది ఎమ్మెల్యేలను అధికార మదం, డబ్బును ఎరగా చూపించి కాంగ్రెస్ లో చేర్చుకోవడం అనైతికం, సిగ్గుమాలిన చర్య కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజా తీర్పును కాలరాసి కాంగ్రెస్ చేసిన సిగ్గుమాలిన చర్య ఓట్లను దొంగిలించడం కంటే ఘోరమైన నేరం అన్నారు. ఓట్ చోరీ గురించి మాట్లాడే ముందు, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన ఎమ్మెల్యేల చోరీపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాతీర్పును అపహాస్యం చేసి సంతలో పశువుల్లా తెలంగాణ లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన తీరుపై భారత్ జోడో న్యాయ్ యాత్ర చేసిన రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలన్నారు కేటీఆర్. ఫిరాయింపులతో తెలంగాణ ప్రజలకు ఆయన ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాలన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. ఎవరి బలం ఏంటో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు అనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపు రాజకీయాలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో ఆ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు.

## కాంగ్రెస్‌లో చేరలేదు, కలిసి పనిచేస్తున్నా..

(మొదటి తరువాయి)

ఉన్న పార్టీతో కలిసి పనిచేయడం ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని కాంగ్రెస్‌తో నడవడం జరుగుతుందని కడియం క్లారిటీ ఇచ్చారు. గత పదిహేను సంవత్సరాలుగా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని కొంతైనా పూడ్చవచ్చని కాంగ్రెస్‌తో పని చేస్తున్నానని, ఉపముఖ్యమంత్రిగా ఉన్నని రోజులు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదని కడియం శ్రీహరి అన్నారు. కేసీఅర్ డిల్లీలో ఉన్న తనను పిలిచి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారని ఆయన తెలిపారు. రాజకీయ వ్యవస్థను కేసీఆర్ భ్రష్టు పట్టించారని కడియం శ్రీహరి ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో వివిధ పార్టీల నుంచి 36 మంది ఎమ్మెల్యేలను బీ అర్ఎస్‌లో చేర్చుకున్నారని అందులో శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డికి మంత్రిపదవులు ఇచ్చారని కడియం గుర్తు చేశారు. ఆనాడు కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని ఎవరితో రాజీనామా చేయించలేదని తెలిపారు. సభ్యత్వం రద్దు కాలేదని కడియం అన్నారు. అధికారం కోల్పోయిన తరువాత ఫాం హౌస్‌కు పరిమితమైన కేసీఅర్‌కు ఇప్పుడు రాజకీయాలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం.. మరొకరు చేస్తే వ్యభిచారమా అని ఘాటుగా స్పందించారు. కేసీఆర్ తెలంగాణాను ఆగమం చేశారని కడియం ఆరోపించారు. నేను రాజకీయాల్లో ఎవరికీ పాదాభివందనం చేయలేదని.. నీతి.. నిజాయితీతో రాజకీయాల్లో ప్రజల కోసం పని చేస్తున్నానని అన్నారు.పార్టీ మారారని బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లిందని కోర్టు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పిందే తప్ప, సభ్యత్వాన్ని రద్దు చేయమని చెప్పలేదని కడియం శ్రీహరి అన్నారు. స్పీకర్ తనకు వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారనీ వివరణ ఇచ్చే సమయంలో ఉందని కడియం చెప్పారు. ఏదీ ఏమైనా స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని కడియం శ్రీహరి స్పష్టం చేశారు పార్టీ ఫిరాయింపులకు కడియం శ్రీహరి వ్యతిరేకమని, వ్యక్తిగతంగా ఫిరాయింపులను సమర్థించబోనని కడియం అన్నారు. కానీ నియోజకవర్గ ప్రజలు, అభివృద్ధి కోసం తప్పని పరిస్థితుల్లో పార్టీ మారాల్సి వస్తుందని కడియం చెప్పారు. నేను పార్టీలో ఉన్నాననే స్పీకర్ చెబుతానని కడియం చెప్పారు.

## 2025 సెప్టెంబర్ 20, శనివారం తెలుగు పంచాంగం




**మాసం - పక్షం**

భాద్రపద మాసం, కృష్ణపక్షం

**తిథి**

చతుర్దశి:Sep 19 11:37 PM - Sep 21 12:17 AM

ఆమావాస్య ప్రారంభం: Sep 21 రాత్రి 12:17

**నక్షత్రం**

మఘా: Sep 19 7:05 AM - Sep 20 8:05 AM

పూర్వ ఫల్గుని: Sep 20 8:05 AM - Sep 21 9:32 AM

**శుభ సమయాలు**

అమృతకాలం: 2:45 -4:26 AM

అభిజిత్ ముహూర్తం: 11:45 AM - 12:33 PM

**అశుభ సమయాలు**

రాహుకాలం: 9:08 - 10:39 AM

యమగండం: 1:39 - 3:10 PM

గులికా: 6:08- 7:38 AM

వర్జ్యం: 4:34- 6:16 PM

# ఉయ్యాలవాడలో స్వచ్ఛభారత్ సేవా కార్యక్రమం



**నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు సేవా పక్షం కార్యక్రమాన్ని ఉయ్యాలవాడ గ్రామంలో నిర్వహించారు. నాగర్‌కర్నూల్ టౌన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు పాల్గొన్నారు. ఉన్నత పాఠశాల ఆవరణలో, అంబేద్కర్ చౌరస్తా బస్టాండ్ పరిసరాల్లో చెత్త తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. "మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలి. మోదీ ముందుచూపుతో దేశం అనేక రంగాల్లో ప్రగతి సాధిస్తోంది" అని నరేందర్ రావు పేర్కొన్నారు. సేవా పక్షం సందర్భంగా సెప్టెంబర్ 17న రక్తదాన శిబిరం, 18న మహిళా సోదరీమణుల ఆధ్వర్యంలో చిత్రలేఖన, 19న స్వచ్ఛభారత్, చిత్రలేఖన కార్యక్రమాలు నిర్వహించారు. అక్టోబర్ 2 వరకు వివిధ సేవా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి, సుధాకర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు మల్లెకేడి లక్ష్మణ్, జిల్లా కోశాధికారి రాజా రామేశ్వర్, ఎలిమ రాము, శ్రీకాంత్ శర్మ, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, బొట్టు శీను, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పెదబాబు, గుడ్లనర్వ వెంకటయ్య, బాలరాజ్, సూరిబాబు, నరేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతపై రైతుల ఆందోళన



**ఎలిగేడు, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పంట పొట్ట దశలో ఉండగా యూరియా అందక రైతులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. మండల కేంద్రంలోని పిఎసిఎస్ గోదాంలో యూరియా వచ్చిందన్న సమాచారం తెలుసుకున్న రైతులు వేకువజామునే క్యూ లైన్‌లో నిలబడి పడరాని పాట్లు పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 1000 మందికి పైగా రైతులు ఒక్కసారిగా కేంద్రానికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యూరియా బస్తాల కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "నత్రజని లోపంతో వరి పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. అయా గ్రామాల్లో యూరియా పంపిణీ చేసినప్పటికీ, మండల కేంద్రానికి మళ్లీ రావడం ఏంటని ఎలిగేడు రైతులు మిగతా గ్రామాల రైతులను నిలదీశారు. కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. వెంటనే పోలీస్ సిబ్బంది, వ్యవసాయ అధికారులు?చేరి పరిస్థితిని చక్కదిద్దారు. క్యూలో నిలబడిన రైతులకు టోకెన్ ఇచ్చి, ఒక్క టోకెన్‌కు ఒక్క యూరియా బస్తా చొప్పున 450 మందికి యూరియా పంపిణీ చేశారు.

# స్వచ్ఛభారత్‌లో భాగంగా సేవా పక్షం కార్యక్రమం



**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సేవా పక్షం 2025 సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్ 12వ డివిజన్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ స్టేడియం పరిసరాల్లో రోడ్డు ఇరువైపులా చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు. సేవా ప్రోగ్రాం కన్వీనర్ కడార్ల విమల్, తిప్పారపు శ్రీనివాస్, అప్పిరాజు వంశీ, పైడా రవికుమార్, బూత్ అధ్యక్షులు వంగ సంపత్, బొడ్ల శ్రవణ్ కుమార్, నాంపల్లి రమేష్, పిట్టల సుమంత్, తిరుపతి, గున్నాల కన్నాంబ, ప్రేమలత, అనుదీప్ చారి పాల్గొన్నారు.

# కొండగట్టులో కోటి హనుమాన్ చాలీసా పారాయణం



**కొండగట్టు, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కోటి హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమంలో భాగంగా హనుమాన్ ధ్యాన మందిరంలో శ్రీరామ దూత భక్తమండలి ఆధ్వర్యంలో చాలీసా పారాయణం నిర్వహించారు. కరీంనగర్ హనుమాన్ నగర్ నుంచి వచ్చిన భక్తులు పురుషులు, మహిళలు సమూహంగా పాల్గొని భక్తిశ్రద్ధతో, ఆనందతన్మయతతో పారాయణం చేశారు. జైశ్రీరామ్ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తుల సమూహం ఆధ్యాత్మికతతో నిండిన వాతావరణాన్ని సృష్టించింది.

# పాలేరు నుండి పద్మభూషణ్ స్థాయికి

## బోయి భీమన్న



**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సామాజిక చైతన్యాన్ని సాహిత్యంగా మలిచిన మహాకవి పద్మభూషణ్ డా. బోయి భీమన్న జయంతి వేడుకలు శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొని ఆయన సాహిత్య సేవను కొనియాడారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డా. బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ"బోయి భీమన్న రచనలు సామాజిక అంతరాలను ప్రశ్నించాయి. దళిత సాహిత్యానికి పునాది వేసిన కవి ఆయన. పాలేరు ఇంట పుట్టిన భీమన్న పద్మభూషణ్ స్థాయికి ఎదిగిన ఘనత తెలుగు సాహిత్యానికి గర్వకారణం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూర్ల వేంకటేశ్వర్లు, డా. రాపర్తి శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా. డి. ప్రకాశ్, మాలతీ దేవి, డా. పాత అశోక్, డా. పుప్పాల చైతన్య, డా. టి. భోజన్న, పొరండ్ల శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బ్లూటూత్ స్పీకర్లు పంపిణీ చేసిన భరోసా సంస్థ




**ఎలిగేడు, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అందుల విద్యార్థులకు బ్లూటూత్ స్పీకర్లు పంపిణీ చేశారు. గత ఏడేళ్లుగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు చదవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారి విద్యాభివృద్ధికి తోడ్పడే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు. అక్కినపల్లి విశ్రుత్ రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు మాట్లాడుతూ"విద్యార్థులు తమ సబ్జెక్టులను మెమొరీ కార్డులో రికార్డు చేసి, బ్లూటూత్ ద్వారా విని నేర్చుకునే వీలుగా ఈ స్పీకర్లు ఉపయోగపడతాయి. ప్రతి విద్యార్థి దీనిని సద్వినియోగం చేసుకోవాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ జ్యోతి, అభిరామ్, విశ్రుత్ రామ్, తోటపల్లి సతీష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ సార్, రమేష్ సార్, ఉపాధ్యాయురాలు సరళ మేడం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మీడియా కన్వీనర్‌గా నియామకంపై జగదీష్ ధన్యవాదాలు



**ఆమనగల్లు, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మున్సిపాలిటీ కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా తనను నియమించినందుకు మల్లెపాకుల జగదీష్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు మాజీ శాసన సభ్యులు చల్లా వంశీచంద్ రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగ లక్ష్మీకాంత్ రెడ్డి, ఆమనగల్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, బాధ్యతతో పని చేసి కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తీసుకురావడం నా ధ్యేయం" అని జగదీష్ పేర్కొన్నారు.

# ఘనంగా ఎన్.ఎస్.ఎస్. ఆవిర్భావ దినోత్సవం




**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఎన్.ఎస్.ఎస్. ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ"జాతీయ సేవా పథకం ద్వారా కళాశాల తరఫున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాం. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవాటు చేయడంలో ఎన్.ఎస్.ఎస్. కీలక పాత్ర పోషిస్తోంది" అని తెలిపారు. 'సర్వీస్ మోటోతో ప్రారంభమైన ఎన్.ఎస్.ఎస్. ద్వారా విద్యార్థినులు సామాజిక బాధ్యత, నాయకత్వం, సేవా తత్వం వంటి విలువలు నేర్చుకుంటున్నారు" అని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. నాలుగు యూనిట్లకు చెందిన ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. మొగిలి, డా. యం.వి. లక్ష్మణ్ రావు, పి. స్వరూప, డా. ఈ. స్రవంతి, వైస్ ప్రిన్సిపల్ డా. అఫ్సరీ ఉస్మాని, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# జోగులాంబ శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆహ్వానం

**అచ్చంపేట, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అలంపూర్ జోగులాంబ అమ్మవారి దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను ఆహ్వానించారు. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, జోగులాంబ దేవాలయం ఈవో దీప్తి, ఆలయ అధికారులు కలిసి ఎమ్మెల్యేకు అందజేశారు. అంగరంగ వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం, కల్యాణ మహోత్సవం, రథోత్సవం, కాళరాత్రి పూజ, తెప్పోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.




## రసాయన ఎరువుల వాడకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



**ఎలిగేడు, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రైతులు పంట పొలాలకు పిచికారి చేసే రసాయన ఎరువుల వాడకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఎఫ్ఎంఎం మృదుల అన్నారు. ఎలిగేడు అనుబంధ గ్రామమైన లలిత పల్లె గ్రామంలో సింజెంటా కంపెనీ మరియు ఎఫ్ ఎం ఎం డిస్ట్రిబ్యూటర్ కెశెట్టి రాఘవేంద్ర ఆధ్వర్యంలో తెగులు పురుగు మందుల గురించి రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటకు వచ్చే చీడపీడలు, తెగులు, సుడిదోమ, పురుగు ,నివారణకు సస్యరక్షణకు విస్టోరియప్రో, సేగురిస్ ఏవో, ఇన్సిపియో రిప్లేక్ట్ టాప్, వంటి మందులు వాడకం వల్ల పెట్టుబడులు తగ్గించుకోవచ్చునని ఆమె చెప్పారు. రైతులకు న్యాన్యమైన ఎరువులను అందించడంలో రాఘవేంద్ర ఫర్టిలైజర్స్ యాజమాన్యం ఎంతో కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేసినందుకు సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎం ఎం కంపెనీ ఉద్యోగులు ఎం తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

## భవానినగర్ మైసమ్మ గుడికి నీటి కనెక్షన్‌సమస్య పరిష్కారం


**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



10వ డివిజన్ పరిధిలోని భవానినగర్ మైసమ్మ గుడికి చాలా రోజుల క్రితం నీటి పైపులైన్ వేసినప్పటికీ కనెక్షన్ ఇవ్వకుండా వదిలిపెట్టడంతో స్థానికంగా సమస్య ఏర్పడింది. ఈ అంశం మాజీ కార్పొరేటర్ కోడూరి రవీందర్ గౌడ్ దృష్టికి రావడంతో, మున్సిపల్ కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ శాఖ డిప్యూటీ ఇంజినీర్ దేవేందర్ రెడ్డికి తెలియజేశారు. వెంటనే స్పందించిన డిప్యూటీ ఇంజినీర్, ఇంటర్ లింక్ కనెక్షన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు మాజీ కార్పొరేటర్ రవీందర్ గౌడ్.

## నిబంధనలు పాటించని ఐకాన్ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**




పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, కనీస రసీదులు కూడా ఇవ్వకుండా ఐకాన్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భామండ్ల పెల్లి యుగంధర్ ఆరోపించారు. నగరంలోని గీతా భవన్ చౌరస్తాకు సమీపంలో ఉన్న ఈ కోచింగ్ సెంటర్ నిబంధనలను తుంగలో తొక్కుతూ, ఇరుకైన గదుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నదని, ఫైర్ సేఫ్టీ, పార్కింగ్, మౌలిక సదుపాయాలు లేకుండా బహుళ అంతస్తుల భవనంలో క్లాసులు నిర్వహించడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. “గ్రూప్స్, బ్యాంకు, ఎస్ఎస్‌సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర ఉద్యోగాలకు శిక్షణ ఇస్తున్నామని చెప్పి, పెద్ద ప్రకటనలతో ఉద్యోగం గ్యారెంటీ అంటూ వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. మెటీరియల్ పేరుతో డబ్బులు తీసుకుంటూ, కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు” అని యుగంధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరంలో కోచింగ్ సెంటర్లు విచ్చలవిడిగా పెరిగాయని, వీటిపై జిల్లా కలెక్టర్ తనిఖీలు చేసి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ‘కోచింగ్ సెంటర్ల అధిక దోపిడీపై, మౌలిక సదుపాయాల కల్పనకై త్వరలో ఆందోళన చేపడతాం” అని యుగంధర్ హెచ్చరించారు.

### స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది :

**ప్యాపిలి సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండల పరిధిలోని జలదుర్గం పిహెచ్సి నందు ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా పోషణమా, స్వస్థనారి సుశక్తి పరివారి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి కుటుంబం బాధ్యత ఆ ఇంటి స్త్రీపైనే ఆధారపడి ఉంటుంది స్త్రీలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. కావున ప్రతి మహిళ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబాన్ని చూసుకోవాలని తెలియజేశారు. ప్రతి మహిళ ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ హరిత ,సుల్తానా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జలదుర్గ సిహెచ్ ఆరోగ్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, బిజెపి నాయకుడు మద్దిలేటి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు ,తల్లులు పాల్గొన్నారు.

# ఆధునిక విద్యా విధానాలపై మెలుకువలు అవసరం


**ఎలిగేడు, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆధునిక విద్యా విధానాలపై ప్రతి విద్యార్థి మెలుకువలు నేర్చుకోవాలని రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) హైదరాబాద్ ఉపనిరకుడు ఎస్. రాజేష్ సూచించారు. మండలంలోని రాములపల్లి, నర్సాపూర్, సుల్తాన్‌పూర్ పాఠశాలలను ఆయన సందర్శించి, విద్యా కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ“పాఠశాలల్లో అమలవుతున్న ప్రాథమిక సాక్షరత మరియు సంఖ్యా నైపుణ్య (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాలు, విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజన నిర్వహణ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) వినియోగం వంటి అంశాలను



సమగ్రంగా పరిశీలించాం. విద్యార్థులు స్వయంగా నేర్చుకుంటున్న సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నాం” అని తెలిపారు. “యూడైస్ నమోదు, ముఖ గుర్తింపు హాజరు, ఏఎక్స్ఎల్ తరగతులు, ఖాన్ అకాడమీ తరగతుల వినియోగం వంటి ఆధునిక విద్యా పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించాం. ఉపాధ్యాయులు సూచించిన విషయాలపై దృష్టి పెట్టి, మిగతా విషయాలపై దృష్టి మళ్లించకుండా అభ్యాసాన్ని మెరుగుపరచాలి” అని మార్గనిర్దేశం చేశారు. ఎలిగేడు మండలంలోని పాఠశాలలు పట్టణ పాఠశాలల మాదిరిగా అభివృద్ధి చెందుతున్నాయని, తరగతి గదులు బోధన సహాయ సామగ్రితో నిండి ఉన్నాయని, విద్యార్థులు నైపుణ్యాల్లో ముందున్నారని, ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్ల ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తర్వాత ఏఎక్స్ఎల్ తరగతులు, ఖాన్ అకాడమీ తరగతులను పరిశీలించి, తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నరేంద్ర చారి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా స్థాయి చేతివ్రాత పోటీల బహుమతుల ప్రధానోత్సవం

**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో, పారమిత విద్యాసంస్థల సహకారంతో జిల్లా స్థాయి చేతివ్రాత పోటీలను ఘనంగా నిర్వహించారు. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఈ నెల 7వ తేదీన నిర్వహించిన ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతివ్రాతకు పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావాలనే లక్ష్యంతో, 6 నుండి 10 తరగతుల విద్యార్థులు, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం పోటీలను నిర్వహించామని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద రావు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. పాఠశాల, కళాశాల విభాగాల్లో మొదటి బహుమతి



రూ.5,000, రెండవ బహుమతి రూ.4,000, మూడవ బహుమతి రూ.3,000, నాల్గవ బహుమతి రూ.2,000, ఐదవ బహుమతి రూ.1,000, కన్సోలేషన్ బహుమతులు రూ.500 చొప్పున 5 మందికి అందించారు. ఉద్యోగుల విభాగంలో మొదటి బహుమతి రూ.5,000, రెండవ బహుమతి రూ.4,000, మూడవ బహుమతి రూ.3,000, నాల్గవ బహుమతి రూ.2,000, ఐదవ బహుమతి రూ.1,500, కన్సోలేషన్ బహుమతులు రూ.1,000 చొప్పున 15 మందికి అందించారు. మొత్తం మూడు విభాగాల విజేతలకు రూ.66,500 నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ, జిల్లా విద్యాధికారి యస్. మొండయ్య, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద రావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కార్యక్రమ సమన్వయకర్త అభినవ్ దిడ్డి, న్యాయనిర్ణేత దిడ్డి సతీష్, డైరెక్టర్లు ప్రసూన్, అనూకర్ రావు, రశ్మిత, వినోద్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, శ్రీకర్, కవిత, ప్రసాద్, శర్మిష్ఠ, గోపీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దసరా పండుగకు వేతనాలు వస్తాయా?

**ఎలిగేడు, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు రెండు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులు, జీతాలు లేక కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. ఉదయాన్నే రోడ్లపైకి వచ్చి, చెత్తా చెదారం తొలగించడం, మురుగు కాలువల్లో పూడికలు తీయడం వంటి పనులు చేస్తూ, స్వచ్ఛ గ్రామాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. అయినప్పటికీ, వేతనాల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడం బాధాకరం. మండలంలోని 12 గ్రామాల్లో 48 మంది కార్మికులు పనిచేస్తుండగా, మొత్తం రూ.9,12,000 వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. దసరా పండుగను కుటుంబంతో కలిసి జరుపుకోవాలన్న ఆశతో, కార్మికులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

**పండుగకు పస్తులేనా?**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 2న దసరా పండుగను ఘనంగా జరుపుకుంటారు. కానీ గ్రామ పంచాయతీ కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి




ఏర్పడింది. ఎంపీడీవోకు వినతిపత్రాలు ఇచ్చినా, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. పాలకవర్గాల లేకపోవడం, నిధుల కొరత, పన్నుల వసూళ్లు తగ్గడం వంటి కారణాలతో జీతాల చెల్లింపులో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో, పని భారం అధికమై, పాలనలో గందరగోళం నెలకొంది.

**సామాజిక భద్రతా పథకాలు అమలవ్వాలి**
ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి పథకాలు అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జీవో 51 రద్దు చేసి, రోజుకు ఎనిమిది గంటల సమయపాలన అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**కార్మికుల వేదన**
**ఇరుగురాళ లచ్చయ్య (జిల్లా జిపి కార్మికుల ఉపాధ్యక్షుడు):** “ఎప్పుడు పడితే అప్పుడు పిలిచి పనులు చేయిస్తున్నారు. కానీ మా సమస్యలు పట్టించుకోవడం లేదు. బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలి.”

**దేవయ్య (ఎలిగేడు):** “జీతాలు రాక పస్తులు ఉండాల్సి వస్తుంది. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. దసరా ఎలా గడుస్తుందో తెలియదు.”

**శ్రీనివాస్ (మండల జిపి కార్మికుల అధ్యక్షుడు):** “పనులు చేయించుకుంటున్నారు. జీతాలు అడిగితే ముఖం చాటేస్తున్నారు. ప్రభుత్వం దసరా పండుగకు మమ్మల్ని ఆదుకోవాలి.”

# కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

**నిజాంపేట్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆకర్షితులై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ వాసులు కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరారు. మహిళా అధ్యక్షురాలు కడియాల ఇందిరా ఆధ్వర్యంలో, బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 100 మందికి పైగా పార్టీ కండువా కప్పుకొని చేరిక చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ, ప్రతి తెల్ల కార్డుదారునికి సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు ప్రజలకు అందిస్తున్నాం” అని తెలిపారు. కాలనీ అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటానని హన్మంతన్న



హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు ధమని శ్రావణ్ కుమార్, మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు రషీద్, సంజీవ రెడ్డి, అలేటి శ్రీనివాస్ రావు, రంగయ్య, ప్రశాంత్ రెడ్డి, అది రెడ్డి, సోమనాథ్, మైనారిటీ అధ్యక్షులు ఎండి నయీమ్, లేబర్ సెల్ ఉపాధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, గిరిజారాణి, శ్రీదేవి, నల్లపు శిరీష, కర్రి రాధిక, మౌనిక, శిల్ప, కృష్ణవేణి, మాధురి, కృష్ణమ్మ, సంగీత, వినోద, లక్ష్మి, రేణుక, నీలమ్మ, దేవి, క్రాంతి, నాగరాణి, కనకదుర్గ, చంద్రమ, సుగుణ, సంధ్య, అరుణ, విజయ, శ్రద్ధ, కౌసల్య, నీలిమ, అమ్ములు, సుజాత, ఆశ, సునీత, కమల, స్వర్ణ, బేబీ, తులసి, చిన్నారి, సత్యవతి, రమేష్, హుస్సేన్, సంపత్, కుమారస్వామి, సంతోష్, సుమన్, భోగ్య, శేఖర్, చంద్రయ్య, సతీష్, కవిత, మమత తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు డ్రైన్లు దెబ్బతిన్నాయి

## ప్రజల భద్రతపై ఆందోళన

**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇటీవల నగరంలో కురిసిన భారీ వర్షాలకు పాత డ్రైన్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తక్కువ సమయంలో అధిక వర్షం పడటంతో, 15-20 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైన్లు నీటి ఒత్తిడిని తట్టుకోలేక పలు ప్రాంతాల్లో కూలిపోయాయి. డ్రైన్ కెపాసిటీ సరిపోకపోవడం, మౌలిక నిర్మాణం బలహీనంగా ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని భారతీయ జనతా పార్టీ తరపున మాజీ మేయర్ వై. సునీల్ రావు పేర్కొన్నారు. నగరంలో ఇటీవల నిర్మించిన డ్రైన్లు ఎలాంటి ఇబ్బందులు కలిగించకపోయినా, పాత డ్రైన్లు గత రెండు సంవత్సరాల వర్షాలతో ఇప్పటికే బలహీనమయ్యాయని, ఇటీవల కురిసిన వర్షాలతో మరింతగా నష్టపోయాయని ఆయన తెలిపారు. డ్రైన్లను వెంటనే పునరుద్ధరించాలని, మరమ్మతులు చేపట్టి భవిష్యత్తులో ప్రమాదాలు తలెత్తకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో 53వ డివిజన్ కాశ్మీర్ గడ్డలో అపూర్వ కాలేజ్ సమీపంలోని డ్రైన్‌ను



మాజీ కార్పొరేటర్ టి. చంద్రమౌళి, స్థానిక నాయకులు, మున్సిపల్ అధికారులు కలిసి పరిశీలించారు. 24 సంవత్సరాల క్రితం నిర్మించిన పెద్దమోరి లోపలి గోడ కూలిపోవడంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి కలెక్టర్ కార్యాలయం, అంబేద్కర్ స్టేడియం, కోతిరాంపూర్, దెద్దులమ్మ కుంట వరకు ప్రజలకు ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. ఈ మార్గంలో పలు పాఠశాలలు, కళాశాలలు, హోటళ్లు ఉండటంతో రద్దీ అధికంగా ఉంది. డ్రైన్ పక్కన నడిచే సమయంలో ఎవరైనా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, గతంలో చిన్నపాప మృతి చెందిన ఘటనను గుర్తుచేస్తూ, ఇది మెయిన్ రోడ్డుపై ఉండటంతో మరింత జాగ్రత్త అవసరమని పేర్కొన్నారు. డ్రైన్‌ను వెంటనే మరమ్మతు చేసి, దానిపై స్లాబ్ వేసి భద్రత కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ స్పందించి 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి సమస్యలు నగరంలో ఎక్కడ కనిపించినా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించాలని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వరదల కారణంగా కలిగిన నష్టాన్ని ఫ్లడ్ డ్యామేజ్ నిధుల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మించిన డ్రైన్లు ఎక్కడా సమస్య కలిగించకపోయినా, పాత డ్రైన్లు కెపాసిటీ తగ్గిపోవడం, నీటి ఒత్తిడి అధికంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో, ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని వెంటనే మరమ్మత్తు కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం



**హుస్నాబాద్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మున్నూరు కాపు వర్గానికి చెందిన సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మున్నూరు కాపు రాష్ట్ర నేతలు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. వృత్తి విద్యా కోర్సులకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నది ప్రధాన డిమాండ్‌గా ఉంది. హైదరాబాద్‌లోని కోకపేట ప్రాంతంలో మున్నూరు కాపుల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని నేతలు కోరారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర హౌజ్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు, అధికార ప్రతినిధి మంగళారపు లక్ష్మణ్, ఈశంపల్లి వెంకన్న, ఆకుల సతీష్, వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

## చైల్డ్ హెల్ప్ లైన్ అవగాహన సదస్సు

**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తమ విద్యార్థి దశను సద్వినియోగం చేసుకోవాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ సూచించారు. శుక్రవారం బ్యాంకు కాలనీలోని దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా వోక్సి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్ప్ లైన్ విభాగం అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆవుల సంపత్ యాదవ్ మాట్లాడుతూ, "ప్రస్తుత కాలంలో యువత అనేక ఆకర్షణలకు లోనవుతున్నారు. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వాడకాన్ని నియంత్రించకపోతే చెడు అలవాట్లకు బానిస కావడం ద్వారా ఆరోగ్య సమస్యలు, ఒంటరితనం, మానసిక ఒత్తిడికి గురవుతారు" అని హెచ్చరించారు. యువత మంచి మార్గాన్ని ఎంచుకొని, శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని,




కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవల గురించి, పోక్సో చట్టం 2012, బాల్య వివాహ నిరోధక చట్టం 2006 వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారుల హక్కులు, భద్రత, అత్యవసర సమయంలో 1098 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సహాయం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ మమత, శిక్షకులు జక్కుల రాజు, స్పందన శ్రీనివాస్, శిక్షణ పొందుతున్న యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. యువత భవిష్యత్తు బాగుండాలంటే, అలవాట్లపై నియంత్రణ అవసరమని, చైల్డ్ హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# హౌసింగ్ బోర్డ్ కాలనీ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి



**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హౌసింగ్ బోర్డ్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ శుక్రవారం తనిఖీ చేశారు. పిఓఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియాతో కలిసి ఆయన హాజరు పట్టిక, అవుట్ పేషెంట్ రిజిస్టర్లు, ఇతర వైద్య రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అధిక రక్తపోటు, షుగర్ వంటి అసంక్రమిత వ్యాధులకు సంబంధించి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న మందులనే వినియోగించాలని, ప్రైవేటు మందుల కోసం డబ్బులు ఖర్చు చేయడం తగ్గించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి, అన్ని వేళలూ శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల రికార్డులను తనిఖీ చేసి, వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించారు. ఫార్మసీ స్టోర్స్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ జరిగిన మహిళలను రీ-స్క్రీనింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఓఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రణవ్, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అంగారిక టౌన్‌షిప్ అభివృద్ధిపై సుడా చైర్మన్‌కు వినతిపత్రం

**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**



తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణా కాలనీలో ఉన్న అంగారిక టౌన్‌షిప్ అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టౌన్‌షిప్ అసోసియేషన్ ప్రతినిధులు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "గత ప్రభుత్వంలో ప్లాట్ల విక్రయాల ద్వారా దాదాపు రూ. 150 కోట్లు వచ్చినా కనీస మౌలిక వసతులు కల్పించలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ పెద్దలతో చర్చించి అభివృద్ధికి కృషి చేస్తున్నాం" అని తెలిపారు. ఇప్పటికే రూ. 2 కోట్లతో అంతర్గత రోడ్లు ఫార్మేషన్ చేసినట్లు పేర్కొంటూ, మరో రూ. 20 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. మిగిలిన 32 ప్లాట్లను విక్రయించి వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కలెక్టర్ ద్వారా హౌసింగ్ శాఖ అనుమతి కోరామని తెలిపారు.

## బ్యాంక్ సందర్శించిన జడ్పీహెచ్ఎస్ కోహెడ విద్యార్థులు

**అబ్దుల్లాపూర్ మెట్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ కోహెడ పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక బ్యాంక్‌ను సందర్శించారు. విద్యార్థుల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు ఈ పర్యటనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మీలా విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు తిరుపతి భాయి మేడం గార్లు పాల్గొన్నారు. బ్యాంక్ కార్యకలాపాలపై విద్యార్థులకు వివరాలు అందజేశారు. ఖాతా నిర్వహణ, డిజిటల్ లావాదేవీలు, పొదుపు ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

# ఇంపాక్ట్- 2025 అంతర్జాతీయ శాంతి ప్రతిభ అవార్డు అందుకున్న కొర్ర కిషన్ నాయక్



**దేవరకొండ, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజలు ప్రభుత్వ అధికారులు పనితీరులోనీ ప్రజల స్వంతమైన చట్టపరమైన అంశాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ అన్నారు. హైదరాబాదులో హైదరాబాద్ లో నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం లో గోల్డెన్ ఫ్యూచర్ సేవా ఫౌండేషన్ వారు, మోర్డ్ ఆర్గనైజేషన్ 28 సంవత్సరాల వేడుకలలో


INPACT 2025
INTERNATIONAL PEACE & TALENT AWARDS
CERTIFICATE
OF APPRECIATION
PROUDLY PRESENTED TO
KORRA. KISHAN NAIK
RAKSHANA SAMITHI TELANGANA STATE PRESIDENT
In Recognition of Outstanding Contributions to Promoting Peace & Highlighting Out- standing Talent Worldwide
18-09-2025
DATE
SIGNATURE
Venue: Potti sriramulu telugu university, Hyderabad

భాగంగా ఇంపాక్ట్- 2025 అంతర్జాతీయ శాంతి ప్రతిభ అవార్డు ను సమాచార హక్కు చట్టం రక్షణ సమితి (ఆర్టీఐ-2005) రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.టి.ఐ సమాచార హక్కు చట్టం పై ప్రజలలో అవగాహన కల్పిస్తూ ప్రజల కోసమే రూపొందించబడిన ఆర్టిఐ పై ప్రజలలో మరింత మేలుకొలుపును పెంపొందించే దిశగా ముందుకు వెళుతున్న క్రమంలో ఇలాంటి అవార్డు ను అందించడం శుభ తరుణమని వారన్నారు. ఈ అవార్డు అందుకోవడంతోపాటు మరింత బాధ్యత పెరిగిందని ప్రజలు ప్రభుత్వం రూపొందించిన చట్టాలను వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరికి చట్టంలో ప్రశ్నించే అధికారం ఉందని వారు కోరారు. రానున్న రోజులలో సమాచార హక్కు చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలలో అవగాహన కొరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయబోతున్నామని ప్రజలు సమాజం పట్ల బాధ్యత కలిగిన యువకులు ముందుకు రావాలని వారు తెలిపారు..

# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం

**కరీంనగర్, సెప్టెంబర్19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**




మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోతిరాంపూర్ పద్మశాలి వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ, పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ మాట్లాడుతూ, "ప్రతి గర్భిణీ, బాలింత శుక్రవారం సభకు హాజరై తమ సమస్యలు చెప్పాలి. సమస్యలు అప్పటికప్పుడు పరిష్కారం అవుతాయి" అని సూచించారు. డీఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ, "ఆరోగ్య మహిళా కార్యక్రమంలో 50 రకాల ఉచిత పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. మహిళలు వీటిని వినియోగించుకోవాలి" అని తెలిపారు. సీడీపీఓ సబితా మాట్లాడుతూ, "పోషణ మాసం నెల రోజుల పాటు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరుగుతాయి" అని పేర్కొన్నారు. అన్నప్రాసన, పోషణ ప్రతిజ్ఞతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు శివకుమార్ ఎంపిక



**బిజినేపల్లి, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగర్‌కర్నూలు జిల్లా నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు గౌరవం దక్కింది. బిజినేపల్లి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ఆర్. శివకుమార్, బీజెడ్సీ రెండో సంవత్సరం చదువుతూ గుజరాత్‌లో నిర్వహించనున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రీ-రిపబ్లిక్ డే ఎంపిక శిబిరానికి ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉమాదేవి, అధ్యాపకులు అంజయ్య, వనిత, కోదండరాములు, రామకృష్ణ, దశరథం, రమ్య తదితరులు శివకుమార్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా స్థాయి నుంచి జాతీయ వేదికపై ఎంపిక కావడం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని, శివకుమార్ ప్రతిభకు ప్రశంసలు వెల్లువెత్తాయి. కళాశాల ప్రతిష్ఠను పెంచే ఘనతగా ఈ ఎంపికను పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**వెల్దండ, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మండల పరిధిలోని పోషమ్మగడ్డ గ్రామ పంచాయతీ దుబ్బ తండాకు చెందిన జర్పుల వసంతకు 22,500, స్వప్నకు 12,500, భవానికు 15,000 ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరయ్యాయి. ఈ చెక్కులను శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బాధితులకు అందజేశారు. పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యేకు కాంగ్రెస్ యువ నాయకుడు దుబ్బ తండ శ్రీను నాయక్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్దండ మోడల్ స్కూల్‌లో పి.డి.ఎస్.యు సభ్యత్వ నమోదు



**వెల్దండ, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ మాట్లాడుతూ, పి.డి.ఎస్.యు చరిత్ర, పోరాటాలు, విజయాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని, విద్యార్థి సంఘంలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రమేష్, మధు, ఆంజనేయులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ జన్మదినం సందర్భంగా జీడిపల్లిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



**మనోహరాబాద్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా జీడిపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ బీజేపీ నాయకులు చీపురులు పట్టి స్వచ్ఛతకు నిదర్శనంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సేవాపక్షం జిల్లా కన్వీనర్ నత్తి మల్లేష్ ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్, సేవాపక్షం మండల కన్వీనర్ కొల్తూరి నరేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు కమ్మరి నరేందర్ చారి, మండల ప్రధాన కార్యదర్శి కరాట మల్లేష్ ముదిరాజు, మండల ఉపాధ్యక్షులు చాకలి మల్లేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మురళి, మండల నాయకులు మామిండ్ల ప్రణయ్, లింగం రమేష్, నరేష్ ముదిరాజ్, మ్యాదారబోయిన ప్రవీణ్, బుల్లెబోయిన గణేష్, నాగు ముదిరాజ్, నర్సు గారి స్వామి, రజనీకాంత్, కర్రే కనకరాజు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా పరుశరాముడు



**పెద్దకొత్తపల్లి, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండల కేంద్రంలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి ఆదేపు నాగార్జున, మద్దిలేటిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యకర్తల సూచనల మేరకు ఎత్తం పరుశరాముడును మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో కదిరేపాడు నరసింహ ప్రధాన కార్యదర్శిగా, పడాల శ్రీనివాసులు ఉపాధ్యక్షుడిగా, బొల్లె శ్రీనివాసులు కోశాధికారిగా, నల్లవాల బాలు కార్యదర్శిగా, జగన్మోహన్ గౌరవ సలహాదారుగా, మాసయ్య, చంద్రశేఖర్, మద్దిలేటి కార్యవర్గ సభ్యులుగా, అర్జున్ మీడియా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు.కొత్త కమిటీ మందకృష్ణ మాదిగ సూచనల మేరకు పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి సూచించారు. ఈ నెల 22న కొల్లాపూర్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక






**హుస్నాబాద్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని ముల్కనూర్ టీజీ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటుతూ క్రీడా రంగంలో విశేష గుర్తింపు పొందారు. పాఠశాల 10వ తరగతి విద్యార్థులు పి. వర్ష శ్రీ మరియు జి. శివమని 35వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు సెప్టెంబర్ 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పాఠశాల వర్గాలు వెల్లడించాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హర్జిత్ కౌర్ మాట్లాడుతూ, "విద్యార్థులు క్రీడా రంగంలో కూడా తమ ప్రతిభను నిరూపించుకుంటుండటం గర్వకారణం. వర్ష శ్రీ, శివమనిలు రాష్ట్ర స్థాయిలో మరింత ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నాము" అని పేర్కొన్నారు.ఫిజికల్ డైరెక్టర్ రమ్య యాదవ్ మాట్లాడుతూ, "కృషి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి వల్లే ఈ స్థాయికి చేరుకున్నారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచుతారని నమ్మకం ఉంది" అని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు వారిని అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# మత్తడి చెరువు పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్

## ఉచిత రక్త, కంటి, దంత శిబిరాల్లో పాల్గొన్న ఎంపీ



**మేడ్చల్ అర్బన్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన, కంటి, దంత చికిత్స శిబిరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ చేపట్టిన సేవా పక్షం కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరాలు నిర్వహించారు. "తలసీమియా, ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం అందించేందుకు ప్రజలు వందల సంఖ్యలో రక్తదానం చేస్తున్నారు. తల్లి ఆరోగ్యం బాగుండాలి, పిల్లలు బాగుండాలి, దేశం బాగుండాలి" అని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం తూముకుంట, మత్తడి చెరువు ప్రాంతాల్లో వరద మోప్పు పరిస్థితులను పరిశీలించిన ఎంపీ మాట్లాడుతూ "ఇల్లు మునిగిపోతున్నాయి, వస్తువులు తడిచిపోతున్నాయి. ప్రభుత్వం తాత్సారం చేయకుండా, నష్టపోయిన ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి. ముంపు ప్రాంతాలపై పూర్తి అంచనా వేసి, శాశ్వత పరిష్కారం కోసం నాలా ప్రణాళిక తీసుకురావాలి" అని డిమాండ్ చేశారు. 'డాంబర్ రోడ్లు ధ్వంసమయ్యాయి. ప్రయాణానికి గంటల సమయం పడుతోంది. యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేయాలి. మునిగిన ఇళ్లలో ఫంగస్ వచ్చే ప్రమాదం ఉంది. హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి. బురదతో కరాబైన ఇళ్లను ప్రభుత్వ యంత్రాంగం శుభ్రపరచాలి" అని ఎంపీ రాజేందర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, బీజేవైఎం మాజీ రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్, ఆర్.కె. శ్రీనివాస్, గీత మూర్తి, శ్రవణ్, రాజ్యలక్ష్మి, మీనా ఉపేందర్ రెడ్డి, సునీత యాదవ్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాడులకు నిరసన

## ఆమనగల్ కోర్టులో విధుల బహిష్కరణ




**ఆమనగల్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
న్యాయవాదులపై దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నిన్న అనిల్ కుమార్, హనుమాన్ నాయక్ అనే న్యాయవాదులపై జరిగిన దాడులను నిరసిస్తూ కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదుల రక్షణకు చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అందే కార్ యాదిలాల్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వసుపుల మల్లేష్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, లింగం గౌడ్, మధు గౌడ్, గణేష్ గౌడ్, జగన్ గౌడ్, మహేష్, శ్రీనివాస్, సర్దార్ నాయక్, శ్రీశైలం, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సేవా పర్వ్-2025 అవగాహన కార్యక్రమం






**డిండి,సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "వికసిత్ భారత్ 2047" లక్ష్యంతో, దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు "సేవా పర్వ్" నిర్వహిస్తున్నారు .సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య చైతన్యం, స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, సిఎస్ ఐఆర్ ఐఐసిటిలోని ఈ ఐఏసిపి కేంద్రం నల్గొండ జిల్లా, డిండి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో విశేష అవగాహన కార్యక్రమం చేపట్టారు . డా. నిఖిల యలదండా, ఈఐఏసిపిబృందం , సంపత్,శ్రీలేఖ, దీప్తి, హరిప్రసాద్ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వాతావరణ మార్పులు, ప్రజారోగ్యంపై వాటి ప్రభావం, మిషన్ లైఫ్ ముఖ్యాంశాలపై వివరించారు.
ఈ సందర్భంగా క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులంతా "మిషన్ లైఫ్" ప్రతిజ్ఞ చేసి, " ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శిరీష, నాగలక్ష్మి, జ్యోతి,స్నేహ,మరియు ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సాక్షిగా... చెత్త కుప్పలు

-మాజీ మేయర్ మాజీ డిప్యూటీ మేయర్ ఊరిలోనే ఘటన
-బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి పార్టీ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు



**సరూర్ నగర్,సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్నగర్ లో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ....అంబేద్కర్ విగ్రహం సాక్షిగా చెత్త కుప్పలు -మాజీ మేయర్ మాజీ డిప్యూటీ మేయర్ ఊరిలోనే బాలాపూర్ దురవస్థ! అధికారులు -మాజీ ప్రజాప్రతినిధులు కళ్ళు మూసుకున్నారా?"బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రాలగూడం రామకృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామంలో పరిస్థితి తీవ్రంగా దారుణంగా ఉంది. సాక్షాత్తు అంబేద్కర్ విగ్రహం ఎదుటే చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. వీధులు బురదతో నిండిపోయి, డ్రైనేజీ లీకేజీలు పూడ్చక ప్రజల ఆరోగ్యాన్ని ముప్పులోకి నెడుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు ఇంత దయనీయమైన పరిస్థితి ఉన్నా ఈ ఊరిలోనే నివసించే మాజీ మేయర్ ఏం చేస్తున్నారు? మాజీ డిప్యూటీ మేయర్ ఈ దురవస్థ చూడరా? మాజీ కార్పొరేటర్లు ఇప్పటికీ ప్రజల కోసం బదులు చెప్పలేరా?లి ప్రజలు ఎన్నుకున్న వారే తమ ఊరి సమస్యలు చూసుకోలేకపోతే ప్రజలకు ఏం ఉపయోగం?అధికారులు బాధ్యతారాహిత్యంగా కళ్ళు మూసుకొని కుర్చీల్లో కూర్చుని జీతాలు వసూలు చేసుకుంటున్నారు. ప్రజలు పన్నులు కట్టేది చెత్త కుప్పల్లో, మురికిలో జీవించేందుకా? ప్రజా సమస్యలపై స్పందించని అధికారులు, నోరు మూసుకున్న మాజీ ప్రజాప్రతినిధులు వెంటనే మేల్కొని పనిచేయాలి. లేకపోతే ప్రజలే మీకు బదులు చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి

## పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 అడుగుల విస్తరణ పనులను పర్యవేక్షించిన శాసనసభ పర్యవేక్షణ కమిటీ (పీఏసీ) చైర్మన్ ఆరెకపూడి గాంధీ. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డీసీ గంగాధర్, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, విద్యుత్, పారిశుధ్య శాఖల అధికారులతో కలిసి పాదయాత్రగా సిక్కుల బస్తీ వరకు నడుచుకుంటూ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, "ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ రహదారి నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి 100 అడుగుల రహదారి విస్తరణ చేపట్టాం. పనులను యుద్ధప్రాతిపదికన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలి. ఎక్కడా రాజీ పడకుండా, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి" అని పేర్కొన్నారు. విస్తరణలో భాగంగా విద్యుత్ స్థంభాల స్థానభ్రంశం, రహదారి మధ్యలో సుందరీకరణ పనులు, అడ్డంకుల తొలగింపు, విభాగాల సమన్వయం వంటి అంశాలపై అధికారులతో చర్చించి, తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. "ఈ రహదారి విస్తరణ వల్ల ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు పూర్తి చేస్తాం" అని గాంధీ స్పష్టం చేశారు. "100 అడుగుల రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రజల నుంచి వచ్చే ప్రతి చిన్న సమస్యను స్వయంగా పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తాను. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాను" అని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ ఈఈ గోవర్ధన్, ఏఈ శ్రావణి, పనుల పరిశీలకుడు రవి కుమార్, పట్టణ ప్రణాళిక ఏసీపీ జిషన్, టీపీఎస్ మధు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఆరు సంవత్సరాల కల నిజమైంది

## సుల్తాన్‌పూర్‌కు బస్సు సేవలు ప్రారంభం



**సరూర్‌నగర్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి ఆరు సంవత్సరాల నిరీక్షణకు తెరపడింది. గ్రామస్తుల దీర్ఘకాలిక డిమాండ్ మేరకు నూతన బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. సందర్భంగా రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు గ్రామానికి చేరుకొని డ్రైవర్, కండక్టర్, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాషాయ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు శ్రీరాములును ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాములు మాట్లాడుతూ "సమస్యలను విన్నప్పుడు స్పందించటం నా బాధ్యత. ఇది ప్రారంభం మాత్రమే, గ్రామ అభివృద్ధికి ఇంకా చాలా చేయాల్సి ఉంది" అని పేర్కొన్నారు. బస్సు ప్రారంభంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇకపై రాకపోకలలో ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా సౌకర్యవంతమైన రవాణా పొందగలుగుతారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సేవలు ప్రారంభం కావడానికి శ్రీరాములు చేసిన నిరంతర కృషి, అధికారులతో అనుసంధానం, ప్రజా అవసరాల పట్ల చూపిన నిబద్ధతే కారణమని గ్రామస్థులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రావుల మల్లేష్, సీనియర్ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, కొంతం సంపత్ రెడ్డి, మద్ది రాజశేఖర్ రెడ్డి, వరికుప్పల వెంకటేష్, మోతిలాల్ నాయక్, మంగాపతి నాయక్, క్యారగారి అరవింద్, శ్రీను నాయక్, బీజేవైఎం నాయకులు కిరణ్ రాజ్, రఘు నాయక్, చైతన్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల బిడ్డను అంటావు అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పడావ్ పెట్టావు

- -ఆల్మట్టి ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారే
- -చంద్రబాబుకు గురు దక్షిణగా తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు
- -రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి



**వనపర్తి సెప్టెంబర్ 19( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఈ నెల 28న అచ్చంపేటలో జరిగే కె.టి.ఆర్ బహిరంగ సభ సభా స్థలి,కార్యాచరణ ప్రణాళిక పర్యవేక్షించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పాత్రికేయ సమావేశములో మాట్లాడుతూ సి.ఏం రేవంత్ రెడ్డి చంద్రబాబు ప్రతినిధిగా పని చేస్తూ సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఆంధ్రా ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని దుయ్యబట్టారు కె.సి.ఆర్ ప్రభుత్వం కృష్ణా,గోదావరికి వచ్చే వరద ప్రతిఒక్క నీటి బొట్టును ఒడిసిపట్టి సాగు నీరు అందించిందని కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరదలు వచ్చిన 45రోజుల పాటు నీళ్లను సముద్రం పాలు జేసిందని వాపోయారు.కర్ణాటక ప్రభుత్వం బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పును ధిక్కరిస్తూ ఆల్మట్టి డ్యాం ఎత్తు సముద్ర మట్టానికి 519మీటర్ల నుండి 524 మీటర్లకు పెంచడానికి 70వేల కోట్లతో ఒక లక్షా 20వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కుట్రలు పన్నుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం ఎవరి ప్రయోజనాలకోసం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిజంగా నీవు నల్లమల బిడ్డవు అయితే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన 75వేల ఎకరాలకు నీళ్లు అందించే అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ఎందుకు పడావ్ పెట్టావు అని ప్రశ్నించారు. అదేవిధంగా బల్మూర్ రిజర్వాయర్,మున్ననూరు చెన్న కేశవ రిజర్వాయర్ ఎందుకు పూర్తి చేస్తలేవు అని విమర్శించారు. గతములో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తుంటే కేసులు వేసి అడ్డుకున్నది మీరు కాదా ప్రజలు మీకు అధికారం ఇచ్చి తప్పు చేశామని బాధపడుతున్నారని ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని అసంపూర్తిగా ఉన్న ఎత్తి పోతల పథకాలు,రిజర్వాయర్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.అచ్చంపేటలో కె.టి.ఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రామగుండం అభివృద్ధే నా ధ్యేయం

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్





**రామగుండం, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లను అధికారులతో సమీక్షించిన రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, ప్రజల అవసరాలే తన కర్తవ్య దిశ అని స్పష్టం చేశారు. నగరంలోని రమేష్ నగర్ చౌరస్తా, తిలక్ నగర్ చౌరస్తా, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంతాల్లో ?25 లక్షల టి.యు.ఎఫ్.డి.సి. నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రజల భద్రత, రాత్రివేళల్లో రవాణా సౌకర్యం, వెలుగుల కల్పన కోసం ఈ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో విస్మరించబడిన వీధులు నేడు వెలుగులు నిండుతున్నాయన్నది కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. అభివృద్ధి మాటల్లో కాదు, పనుల్లో కనిపించాలి. రామగుండం ప్రజలకు అభివృద్ధి ప్రత్యక్షంగా కనిపించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏమి జరగలేదని, తాను రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని నిందలు వేసినా, ఎన్ని అబద్ధపు ప్రచారం చేసినా, తన లక్ష్యం రామగుండం అభివృద్ధి మాత్రమేనని రాజ్ ఠాకూర్ పునరుద్ఘాటించారు. రానున్న బతుకమ్మ, దసరా, విజయదశమి పండుగల సందర్భంగా శాంతి భద్రతలతో పాటు మౌలిక సదుపాయాలపై పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళల భాగస్వామ్యం అధికంగా ఉండే బతుకమ్మ పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, విజయదశమి నిమిత్తం గణేష్ నిమజ్జనాల మాదిరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, పోలీస్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, చిన్న సమస్యలు పెద్ద ఇబ్బందులుగా మారకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ & అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పోలీస్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేషన్ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రవక్త పేరుతో బోర్డు పెట్టినందుకు ఎఫ్ఐఆర్‌లు

## అన్యాయమన్న మైనార్టీ నాయకులు



**అమనగల్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రపంచ మానవీయతకు ప్రతిరూపంగా నిలిచిన మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని ప్రతి తరానికి అందించాల్సిన అవసరం ఉందని, ఆయన పేరుతో బోర్డు పెట్టినందుకు యువకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అన్యాయమని మైనార్టీ నాయకులు ఖండించారు. జామియా మసీదు వద్ద నవజవాన్ కమిటీ ఇన్చార్జ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌లో మహమ్మద్ ప్రవక్త పేరుతో బోర్డు పెట్టినందుకు ముస్లిం యువకులపై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాసుమ్, ఖలీల్, పాష, జబ్బర్, అబ్దుల్ హాఫీజ్, అజీమ్, షోయబ్, అసద్, షబ్బీర్, జహీర్, అఫ్రోజ్, బాబా, అంజు, అరీఫ్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గణపురంలో రాధాకృష్ణన్ విగ్రహ ఆవిష్కరణ

## గౌడన్నలకు రక్షణ కిట్లు పంపిణీ



**భూపాలపల్లి, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భూపాలపల్లి నియోజకవర్గం గణపురంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఊరుగొండ రాధాదేవి జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు దేశ నిర్మాణ శిల్పులని, విద్య నైతిక విలువలతో జీవన విధానంలో ప్రతిబింబించాలన్నారు. అదేరోజు గణపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖాధికారి ఊరుగొండ ఉప్పలయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, "ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదు. శేషజీవితం కుటుంబంతో సంతోషంగా గడపాలి" అని సూచించారు. ఇక ఎస్.ఎం కొత్తపల్లి గ్రామ శివారు సోలిపేట తాటి వనంలో కల్లు గీత కార్మికులకు "కాటమయ్య రక్షణ కిట్లు" పంపిణీ చేశారు. ప్రమాదాల నివారణకు ఈ కిట్లు తప్పనిసరిగా వినియోగించాలని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉన్నా, కుల వృత్తుల ప్రోత్సాహానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం కిట్లు అందుకున్న కార్మికులతో ఎమ్మెల్యే గ్రూప్ ఫోటో దిగారు.

# నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

## ఐదుగురు అరెస్ట్, 900 లీటర్ల పానకం ధ్వంసం



**మహబూబాబాద్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని డోర్నకల్ మండలంలోని అమ్మపాలెం, రామకుంట తండా, తోడేళ్లగూడెం, డోర్నకల్, తెల్లబండ తండా గ్రామాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులను మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, వరంగల్ ఎన్ఫోర్స్మెంట్, డిటిఎఫ్ మహబూబాబాద్ బృందాలు సంయుక్తంగా చేపట్టాయి. దాడుల్లో ఐదుగురు నాటుసారా ముద్దాయిలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. దాడుల్లో 14 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకుని, 900 లీటర్ల చక్కర పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా నిర్మూలనకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు చింతలపల్లి నాగేశ్వర్ రావు, చింతలపల్లి నీరజ్, ఎస్ఐలు గోనుగుంట్ల చంద్రశేఖర్, ఇనుగంటి అశోక్ కుమార్, రాచకొండ కిరీటి, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుళ్లు యాదగిరి, వెంకటరమణ, శ్రీను, నర్సింగరావు, ఇబ్రహీం పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎస్‌హెచ్‌ఓ జి. చిరంజీవి పర్యవేక్షణలో ఈ దాడులు నిర్వహించారు.

# ఎమ్మిగనూరులో "స్వచ్ఛత హీ సేవ "ప్రారంభం....

**ఎమ్మిగనూరు సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలోని స్థానిక కలగట్ల వెళ్లే రహదారిలో, ఈరోజు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో" స్వచ్ఛత హి సేవ" కార్యక్రమం ప్రారంభం చేశారు , పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యతని ఆయన తెలిపారు, ప్రజలు తమ చుట్టుపక్కల ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు అంతేకాకుండా, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం పై దృష్టి పెట్టండి అని ప్రజలకు సూచించారు, ఈ కార్యక్రమంలో ఇతర శానిటైజింగ్ సిబ్బంది మరియు మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

# విద్య, అభివృద్ధి, భద్రతపై నాయిని రాజేందర్ రెడ్డి దృష్టి

**హనుమకొండ, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హనుమకొండలోని బాలసముద్రం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మల్టీ పర్పస్ ట్రైనింగ్ సెంటర్‌ను శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బోధనా ప్రమాణాలపై సమీక్ష నిర్వహించిన ఆయన, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. స్వయంగా ఖర్చు భరించి స్టడీ మెటీరియల్ అందజేస్తానని హామీ ఇచ్చారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కేంద్రంలో మరిన్ని ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అదేరోజు శరన్నవరాత్రుల సందర్భంగా భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నాయిని, అమ్మవారి దర్శనం



అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. విద్యుత్ దీపాల అలంకరణతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు శాంతి, సమృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. ఇక వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే, రెండో వంతెన నిర్మాణానికి వేగం చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మొదటి వంతెన పనులు పూర్తయ్యాయని, రెండో వంతెన కొంతమేర పురోగమించిందని తెలిపారు. రైల్వే సూచనల మేరకు ఇనుప వంతెన నిర్మాణం చేపట్టామని, ట్రాఫిక్ తగ్గించేందుకు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాత వంతెన మరమ్మత్తులకు ప్రభుత్వం 59 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆత్మనిర్భర్ భారత్ - వికసిత్ భారత్ అంశాలపై హుస్నాబాద్‌లో చిత్రలేఖన పోటీలు





**హుస్నాబాద్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని "ఆత్మనిర్భర్ భారత్ – వికసిత్ భారత్" అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బీజేపీ పట్టణ ఉపాధ్యక్షురాలు కాదాసు దీపికా, మహిళా మోర్చా నాయకురాలు లకావత్ శారద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో టీఎస్ మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని కె. వెన్నెల మొదటి బహుమతిని, సెయింట్ జోసెఫ్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని బి. రిషికా రెండో బహుమతిని, టీఎస్ మైనారిటీ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని జీ. నేత్ర మూడో బహుమతిని పొందారు. ఇతర విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులుగా పెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ, "విద్యార్థుల్లో దేశభక్తి, పోటీతత్వం, అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహించాం. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ విశ్వగురువుగా ఎదుగుతోంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం 'పీఎం విద్యాలక్ష్మి', 'పీఎం శ్రీ' వంటి పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తోంది" అని తెలిపారు. మౌలిక సదుపాయాలు, టెక్నాలజీ ల్యాబ్స్, సంక్షేమ పథకాల ద్వారా పాఠశాలల అభివృద్ధి జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో బోడిగె వెంకటేష్, గాదాసు రాంప్రసాద్, బొప్పిశెట్టి సాయిరామ్, వడ్డెపల్లి లక్ష్మయ్య, అకోజు అరుణ్ కుమార్, నారోజు నరేష్, తోట సమ్మయ్య, వరియోగుల అనంతస్వామి, పోలోజు రవీందర్, ఇల్లెందుల తిరుపతి, పోగుల శేఖర్, మహిళా నాయకురాలు రేణుకా, శివాణి, లక్ష్మి, అరుణా, కావ్య, సంధ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు.

# ఎస్ఆర్ఆర్ కళాశాలలో బతుకమ్మ ఉత్సవం

**–తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతిబింబం**
**– ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ**

**కరీంనగర్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో బొటానీ విభాగం ఆధ్వర్యంలో, మహిళా సాధికారత కేంద్రం, ఎన్ఎస్సెస్ సహకారంతో బతుకమ్మ పూల పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ – "బతుకమ్మ పండుగ మన సంప్రదాయం, స్త్రీ శక్తి, ప్రకృతి పట్ల భక్తిని ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు. డాక్టర్ తిరుకొవెల శ్రీనివాస్, డాక్టర్ అర్చన, డాక్టర్ బుంగా తిరుపతి, శ్రీమతి స్వరూపరాణి తదితరులు పూల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తంగేడు, బంతి, గుమ్మడిపువ్వు వంటి పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ గీతాలు, నృత్యాలతో కళాశాల ప్రాంగణాన్ని కళకళలాడించారు. ఎన్ఎస్సెస్ విద్యార్థులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# కలకొండ శివారులో అక్రమ ఇసుక రవాణా బహిర్గతం

**–టిప్పర్ స్వాధీనం**
**– ఇద్దరిపై కేసు నమోదు**



**మాడుగుల, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల మండలంలోని కలకొండ గ్రామ శివారులో గస్తీ నిర్వహిస్తున్న మాడుగుల పోలీస్‌స్టేషన్ సిబ్బందికి అనుమానాస్పదంగా టిప్పర్ TS07UK5535 కనిపించడంతో ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో టిప్పర్ నిండా ఇసుక నింపబడి ఉండగా, రవాణా అనుమతుల గురించి ప్రశ్నించగా డ్రైవర్ నెల్లెపల్లి శ్రీశైలం "తన వద్ద ఎటువంటి అనుమతులు లేవు" అని తెలిపాడు. ఈ ఇసుకను బైరాపూర్ వాగు నుండి హైదరాబాద్కు తరలిస్తున్నట్లు, తన యజమాని బాలమోని చంద్రయ్య ఆదేశాల మేరకు చేస్తున్నానని వెల్లడించాడు. దీంతో టిప్పర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి, ఇద్దరిపై అక్రమ ఇసుక రవాణా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తెలిపారు.

# స్వదేశీ టెక్నాలజీకి అండగా ఉంటా

**- ఎంపీ వంశీకృష్ణ**
**-సీఎస్ఐఆర్ - సీఎస్ఐఓ ప్రదర్శనలో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చండీగఢ్‌లో సీఎస్ఐఆర్ -సీఎస్ఐఓ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నాలజీ ప్రదర్శనలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. పార్లమెంటు శాస్త్ర–సాంకేతిక స్థాయీ కమిటీతో కలిసి పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ – "స్వదేశీ సాంకేతికత



జాతీయ ప్రగతికి, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడుతుంది. పరిశోధన, పారిశ్రామిక అమలు, విధాన రూపకల్పన మధ్య అనుసంధానం అవసరం" అని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఆప్టికల్, ఎలక్ట్రో–మెకానికల్ వ్యవస్థలు, ఆరోగ్య పరికరాలు, పర్యావరణ పరిశీలన పరికరాలు, స్మార్ట్ సెన్సార్లు తదితర 200కు పైగా ఆవిష్కరణలు ప్రదర్శించబడ్డాయి. సీఎస్ఐఆర్ అధికారులు స్వదేశీ టెక్నాలజీ ద్వారా భద్రత, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.

# ఖాదీ వస్త్రాలపై 40 శాతం ప్రత్యేక తగ్గింపు

**గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం**




**కరీంనగర్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గాంధీ జయంతి, దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఖాదీ వస్త్రాలపై 40 శాతం ప్రత్యేక తగ్గింపు అందుబాటులోకి వచ్చింది. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని మెట్టుపల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 31వ తేదీ వరకు ఈ తగ్గింపు ధరలు వర్తిస్తాయని సంస్థ చైర్మన్ కె. విద్యాసాగర్ రావు, మేనేజర్ వి. బిక్షపతి తెలిపారు. ఖాదీ వస్త్రాల కొనుగోలుతో లక్షల మంది నేత, వడుకు కార్మికులకు ఉపాధి కల్పించే గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం కలుగుతుందని వారు పేర్కొన్నారు. స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ద్వారా దేశీయ పరిశ్రమలు బలపడతాయని, ఖాదీ వస్త్రాల ధరించటం గాంధీయిా సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు.

# బిందెలతో బైఠాయించిన నారెడ్డిపల్లె మహిళలు

**మంచినీటి –రోడ్ల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా**





**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల శివారు గ్రామం నారెడ్డిపల్లెలో మంచినీటి కొరత, రోడ్ల దుస్థితి గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టి ఆకర్షించేందుకు మహిళలు బిందెలతో రోడ్డెక్కి బైఠాయించారు. 'వారాలుగా తాగునీటి కోసం ఎదురుచూస్తున్నాం. రోడ్లు గుంతలతో నిండిపోయాయి. ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదు" అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, తాగునీటి కోసం బావులు, చెరువులు నమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాపోయారు. ఈ ధర్నా ద్వారా గ్రామస్తులు తమ సమస్యలను అధికారులకు వినిపించేందుకు ప్రయత్నించారు. "మాకు నీరు కావాలి, రోడ్లు కావాలి.. మౌనంగా ఉండే రోజులు పోయాయి" అంటూ నినాదాలు చేశారు.

# ఉత్తమ ఇంజనీరింగ్ అవార్డు పొందిన మహేశ్వరం ఏఈ చక్రపాణి

**శాలువాతో సన్మానించిన కాంగ్రెస్ సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్ర చంద్రమోహన్**



**మహేశ్వరం, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ చక్రపాణికి భారతరత్న డాక్టర్ మోక్షగుండం వెంకటేశ్వరయ్య జయంతి సందర్భంగా ఉత్తమ ఇంజనీరింగ్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. "సాంకేతిక నైపుణ్యం, సేవా దృక్పథం కలగలిపిన చక్రపాణి గారి సేవలు అభినందనీయం. ఇలాంటి ఇంజనీర్లు ప్రజాసేవకు ఆదర్శంగా నిలుస్తారు" అని ఎర్ర చంద్రమోహన్ పేర్కొన్నారు. ఈ అవార్డు మహేశ్వరం మండలానికి గర్వకారణంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# మల్లారెడ్డిపేటలో మోడీ గిఫ్ట్ సైకిళ్ల పంపిణీ

**స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు**



**గంభీరావుపేట, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మోడీ గిఫ్టా పదో తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ప్రతినిధి కొక్కు దేవేందర్ యాదవ్, జిల్లా ప్రతినిధి దేవసాని కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్, విగ్నేష్ గౌడ్, ఎలేందర్, సర్వోత్తమ్, దేవరాజు, నవీన్, నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సైకిళ్లు అందుకున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు.





# సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపు

**-ఆర్జీ వన్ జీఎం కార్యాలయం వద్ద ధర్నా**
**- వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరిక**



**రామగుండం, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు పిలుపునిస్తామని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న ఆయన, "గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కాలేదు. మూడు స్ట్రక్చర్ సమావేశాల్లో 28 డిమాండ్లలో 14 అంగీకరించినా, ఆరు నెలలు గడిచినా సర్క్యులర్‌లు జారీ చేయలేదు" అని ఆరోపించారు. సెప్టెంబర్ 12న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో "లాభాలు ప్రకటించి 35 శాతం వాటా చెల్లించాలి, అంగీకరించిన డిమాండ్లపై సర్క్యులర్‌లు విడుదల చేయాలి" అని కోరినప్పటికీ యాజమాన్యం దాటవేత ధోరణి ప్రదర్శించిందని, అందుకే సమావేశాన్ని బహిష్కరించామని తెలిపారు. ఆగస్టు 24న బోర్డు సమావేశం జరిగినా, లాభాల వివరాలు దాచిపెడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు, కరెంట్ తీసుకుని 42 వేల కోట్ల రూపాయలు బకాయి చెల్లించకుండా కార్మికులను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, మాదన మహేష్, రంగు శ్రీను, ఎస్. వెంకట్ రెడ్డి, బోగ సతీష్ బాబు, సిర్ర మల్లికార్జున్, సయ్యద్ సోహేల్, చంద తిరుపతి, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు ఐదు వందల మంది కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం వినతిపత్రం జీఎం కు అందజేశారు.

# రామగుండంలో చెత్త ఆటోలు, అఖాడ శిక్షణ కేంద్రం ప్రారంభం

**పరిశుభ్రతకు, యువ శక్తికి ప్రోత్సాహం**
**ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్**




**రామగుండం, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో రూ.58 లక్షల వ్యయంతో ఏడు చెత్త ఆటోలను శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. "ప్రతి గడప, ప్రతి గల్లీ మనదిగా భావించి పరిశుభ్రతకు కృషి చేయాలి" అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజలు రెసిడెన్సియల్ వెల్ఫేర్ సంఘాలు ఏర్పాటు చేసుకొని సమిష్టిగా చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ, అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఇ.ఇ. పి.వి. రామన్, పలువురు నాయకులు పాల్గొన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక ఆటో కేటాయించి చెత్త తరలింపు కోసం ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అదే రోజు విశ్వభారతి హైస్కూల్లో హనుమాన్ అఖాడ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. "యువతలో క్రమశిక్షణ, ధైర్యం, శారీరక దృఢత, దేశభక్తి పెంపొందించడంలో అఖాడ శిక్షణ కీలకం" అని ఆయన పేర్కొన్నారు. కబడ్డీ, రెజ్లింగ్, యోగా వంటి శారీరక వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్న ఈ కేంద్రం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జనసంద్రంగా తుక్కుగూడ కెఎల్‌ఆర్ కార్యాలయం

**ఓడినా,గెలిచినా జనం మధ్యే కిచ్చెన్న**



**తుక్కుగూడ, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యాలయం ప్రజలతో కిటకిటలాడుతోంది. కేఎల్‌ఆర్ ఆఫీసు వద్ద పేద ప్రజలు కనిపిస్తే చాలు, సమస్య పరిష్కారం అయ్యే వరకు అక్కడే ఆగిపోతారు. అధికారులకు, సిబ్బందికి తక్షణ చర్యలు తీసుకునేలా ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేస్తారు. విద్యా, వైద్య అవసరాలకు స్వంతంగా ఖర్చు పెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సహాయం అందిస్తారు. పార్టీలకు అతీతంగా తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ సహాయం చేస్తారని ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు సైతం ప్రశంసిస్తున్నారు. 'లీడర్‌గా కాక, పేద ప్రజల సమస్యలు తీర్చినప్పుడే అసలైన సంతృప్తి" అని కిచ్చెన్న తరచూ చెబుతుంటారు. ప్రజల మధ్యే జీవనం గడిపే కేఎల్‌ఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు.

# క్వాక్ క్లినిక్‌పై డ్రగ్స్ కంట్రోల్ దాడి

**నిషేధిత మందులు స్వాధీనం**



**మహేశ్వరం,సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం పెద్దపులి నాగారం గ్రామంలోని ఒక క్వాక్ క్లినిక్‌పై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా అమ్మకానికి అక్రమంగా నిల్వ ఉంచిన వివిధ రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. వైద్య అర్హతలు లేకుండా అక్రమంగా నడుపుతున్న క్లినిక్‌పై కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఇలాంటి క్వాక్ క్లినిక్‌లకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని, అనుమతి ఉన్న ఫార్మసీలు, ఆస్పత్రుల ద్వారా మాత్రమే ఔషధాలు కొనుగోలు చేయాలని సూచించారు.

# సైబర్ నేరాలు అరికట్టేందుకు ప్రత్యేక వారియర్ల నియామకం

**-ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక సైబర్ వారియర్**
**-కమిషనర్ గౌస్ ఆలం**



**కరీంనగర్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సైబర్ నేరాల నియంత్రణకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక సైబర్ వారియర్‌ను నియమించినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం నాడు కమిషనర్ కార్యాలయంలో సైబర్ వారియర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రజలకు అవగాహన కల్పించడంలో వారియర్లది కీలక బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే అపరిచిత లింకులు, ఫిషింగ్ మెసేజ్‌లు, ఏపీకే ఫైళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు డబ్బులు బదిలీ చేయడం, అధిక వడ్డీ వాగ్దానాలు నమ్మడం, డిజిటల్ అరెస్ట్ మోసాలకు గురికావడం వంటి అంశాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తరపున ప్రతి సైబర్ వారియర్‌కు ప్రత్యేక టీ-షర్టులు అందజేశారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడానికి అవసరమైన శిక్షణ కూడా వారికిచ్చినట్లు కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ కోత్వాల్ రమేష్, సీఐ సునీల్ కుమార్, సీఐ సరిలాల్, ఎస్సై జోష్నా, సైబర్ వారియర్లు పాల్గొన్నారు. సైబర్ అవగాహన కార్యక్రమాల నిర్వహణ కోసం సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను లేదా 8712665866 నంబర్‌ను సంప్రదించవచ్చని కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు.


# కరీంనగర్‌లో ప్రాసిక్యూషన్ పనితీరుపై సమీక్ష

**-నేరస్థులకు శిక్ష పడేలా సమన్వయంతో కృషి చేయాలి**
**- కమిషనర్ గౌస్ ఆలం**




**కరీంనగర్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాసిక్యూషన్ విభాగం పనితీరును సమీక్షించేందుకు జిల్లా ప్రాసిక్యూషన్ రివ్యూ కమిటీ సమన్వయ సమావేశం శుక్రవారం నాడు కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ అధ్యక్షతన కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "నేరస్థులకు శిక్షలు పడే శాతాన్ని పెంచేందుకు పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో కృషి చేయాలి. నూతన చట్టాలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగించి, నేరం చేసిన వారికి ఖచ్చితంగా శిక్ష పడేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి" అని సూచించారు. ఇక సెప్టెంబర్ 13న జరిగిన లోక్ అదాలత్‌లో 3130 కేసులు పరిష్కరించడంపై కమిషనర్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్ డి. శరత్, అడిషనల్ పీపీలు జి. లక్ష్మణ్, రంజిత్ కుమార్, వీరాస్వామి, ఏసీపీ శ్రీనివాస్ జి, ఇన్‌స్పెక్టర్ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# నాదర్గుల్ పాఠశాలలో దొడ్డు బియ్యం బువ్వపై మాజీ మంత్రి ఆగ్రహం






**వర్షపు నీరు, మధ్యాహ్న భోజనంపై అసంతృప్తి వ్యక్తం చేసిన సబితా ఇంద్రారెడ్డి**

**బడంగ్‌పేట్, సెప్టెంబర్ 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్గుల్ ప్రభుత్వ పాఠశాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండటం గమనించిన ఆమె, మున్సిపల్ అధికారులు, డీఈ తదితరులను అక్కడికే పిలిపించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడిన అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి, "సన్న బియ్యం ఇవ్వాలి కానీ, దొడ్డు బియ్యం వాడుతూ విద్యార్థులను మోసం చేస్తున్నారు. అబద్ధాలతో బ్రతికే రేవంత్ సర్కార్ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు క్షీణిస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం సరఫరా చేసే వారికి బిల్లులు ఇవ్వకపోవడంతో, సిబ్బంది స్వంతంగా ఖర్చు పెట్టి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని వివరించగా, ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యా వ్యవస్థపై దృష్టి సారించాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, నాదర్గుల్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గుంతల వల్ల మరణిస్తే మున్సిపాల్టీదే బాధ్యత

**అధికారుల జీతాల నుంచి పరిహారం రాబట్టాలి**
**కాంట్రాక్టర్లను బాధ్యులను చేయాలి**
**బాంబే హైకోర్టు సంచలన ఆదేశాలు**
**గుంతల వల్ల రోడ్డు ప్రమాదాలపై సుమోటోగా కేసు విచారణ**






**ముంబై, -సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రోడ్లపై గుంతల కారణంగా జరిగే ప్రమాదాలకు మున్సిపల్ కార్పొరేషన్లను బాధ్యుల్ని చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఓ విధానాన్ని రూపొందించగలదా అని బాంబే హైకోర్టు ప్రశ్నించింది. రోడ్ల దుస్థితి కారణంగా సంభవించే మరణాలు లేదా అయ్యే గాయాలకు పురపాలక సంస్థలు, అధికారులను బాధ్యుల్ని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. రోడ్లపై గుంతల వల్ల జరిగే ప్రమాదాల బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఓ విధానాన్ని రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమో కాదో తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాది ఓఎస్ చందూర్కర్‌ని జస్టిస్ రేవతీ మొహితే, జస్టిస్ సందేశ్ బీ పాటిల్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం గురువారం ఆదేశించింది. మున్సిపల్ కార్పొరేషన్లను బాధ్యుల్ని చేయాలని, మున్సిపల్ అధికారుల జీతాల నుంచి పరిహారాన్ని రాబట్టాలని ధర్మాసనం తెలిపింది. చిన్న జరిమానా సరిపోదని, వారికి కూడా నొప్పి తెలియాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రోడ్లపై గుంతల కారణంగా సంభవిస్తున్న మరణాలపై సుమోటోగా హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్ల దుస్థితికి కాంట్రాక్టర్లను కూడా జవాబుదారీగా చేయాలని ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లోని అన్ని పురపాలక సంస్థలతోపాటు బీఎంసీని కూడా ధర్మాసనం ఆదేశించింది. కాంట్రాక్టర్లకు రూ. 1 లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు జరిమానాలు విధించినట్లు న్యాయవాది తెలియచేయగా కోట్లాది రూపాయల కాంట్రాక్టులు పొందుతున్న వారికి ఈ జరిమానాలు సరిపోవని, వారికి భారీగా జరిమానాలు విధించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. తాము విస్తృతమైన అంశంగా ఈ సమస్యను పరిగణిస్తున్నామని, గుంతల కారణంగా ఏ వ్యక్తయినా మరణించడం లేదా గాయపడడం సంభవిస్తే అందుకు ఎవరు బాధ్యులని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈ విషయంలో జవాబుదారీతనం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# మరో 474 పార్టీలపై ఈసీ వేటు




**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: దేశంలోని చిన్నాచితకా పార్టీలకు భారత ఎన్నికల సంఘం మరోసారి షాకిచ్చింది. గత ఆరేండ్లుగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడం సహా, నిబంధనలు పాటించని, గుర్తింపు లేని, నమోదైన 474 పార్టీలను జాబితా నుంచి తొలగిస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. కాగా, ఈసీ ఆగస్టు 9న మొదటి విడతగా చేపట్టిన ఈ కార్యక్రమంలో 334 నమోదై, గుర్తింపులేని పార్టీ (ఆర్‌యూపీపీ) లను తొలగించిన సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా 474 పార్టీలను కూడా తాజాగా తొలగించామని, మొత్తం రెండు నెలల కాలంలో 808 ఆర్‌యూపీపీలను జాబితా నుంచి తీసివేశామని తెలిపింది. ఇప్పటివరకు దేశంలో 2,520 ఆర్‌యూపీపీలు ఉండగా, తాజా తొలగింపు తర్వాత వాటి సంఖ్య 2,046కు చేరుకుంది. ఇవికాక, ఆరు గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నట్టు ఈసీ వివరించింది.


# ఒడిశాలో బాలికపై గ్యాంగ్ రేప్.. మరో బాలికపై లైంగిక వేధింపులు



**రూర్కెలా సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీజేపీ పాలిత ఒడిశాలో వరుస గ్యాంగ్‌రేప్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. తాజాగా ఇద్దరు యువకులు ఒక బాలికపై సామూహిక లైంగిక దాడికి తెగబడ్డారు. మరొక బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం బాధితులు మరో ఇద్దరితో కలిసి బర్సుయాన్‌లో విశ్వ కర్మ పూజ చూసి ఒక వాహనంలో నిర్జన అటవీ ప్రాంతం గుండా ఇంటికి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు డీఐజీ(పశ్చిమ రేంజ్) బ్రిజేశ్ కుమార్ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం కె బలంగ్ ప్రాంతానికి చెందిన బాధితుల వాహనాన్ని నిందితులు అడ్డగించి అందులోని వారిని భయభ్రాంతుల్ని చేశా రు. ఆ తర్వాత బాధితులపై దగ్గర్లోని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడ్డారు.

# పాక్‌లో ఉంటే సొంతింట్లో ఉన్న ఫీలింగ్

**కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ శామ్ పిట్రోడా మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశ విదేశాంగ విధానం మారాలని, పాకిస్థాన్‌పైన మొదట దృష్టి సారించాలని ఆయన ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిలుపునిచ్చారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్‌ను సందర్శించిన ప్రతిసారి తనకు సొంత ఇంట్లో ఉన్నట్లు ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మూడు దేశాలు కొంతకాలం అలజడి తర్వాత పాలనాపరమైన మార్పులకు లోను కావడం ఆసక్తికరం. హింస, ఉగ్రవాదం వంటి సమస్యలు ఉన్నప్పటికీ పాక్, బంగ్లాదేశ్‌తో భారత్ చర్చలు జరపాలని పిట్రోడా సూచించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్ము కశ్మీరులోని పహల్గాంలో 25 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపిన నేపథ్యంలో పాకిస్థాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకోవాలని పిట్రోడా పిలుపునివ్వడం గమనార్హం. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో తలపడేందుకు భారత క్రికెట్ జట్టుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో పిట్రోడా వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఇరకాటంలోకి నెట్టే అవకాశం ఉంది.

# వనపర్తి జిల్లా గౌరవం నిలబెట్టిన భవ్య

**వనపర్తి, సెప్టెంబర్ 19( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
వనపర్తి జిల్లా పెద్దమందడి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కుమారి సుర భవ్య రాష్ట్రస్థాయి జాతీయ సైన్స్ సెమినార్ -2025లో ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది. "క్వాంటుం ఏజ్ బిజిన్స్ - పొటెన్షియల్ అండ్ ఛాలెంజస్ " అనే క్లిష్టమైన అంశంపై సమగ్రమైన ప్రదర్శనతో ఆమె హైదరాబాద్‌లోని స్కీర్ట్ గోదావరి హాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో 33 జిల్లాల ప్రతినిధి విద్యార్థులతో పోటీ పడింది. ఈ సందర్భంగా ఆమెకు ప్రశంసాపత్రం లభించింది. భవ్య విజయానికి మార్గదర్శకుడైన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీ పి. సాయి చందర్ రెడ్డి కృషిని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ అబ్దుల్ ఘని ప్రత్యేకంగా ప్రశంసించారు. 'భవ్య ప్రతిభ వనపర్తి జిల్లా గౌరవాన్ని రాష్ట్రస్థాయిలో నిలబెట్టింది" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి ప్రతాప్ రెడ్డి, ఎన్ సి జి కోఆర్డినేటర్ సుదర్శన్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

# రేపు జోగులాంబ ఆలయం మూసివేత




**జోగులాంబ, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అలంపూర్‌లో ప్రసిద్ధి చెందిన జోగులాంబ దేవి ఆలయం రేపు మధ్యాహ్నం 1:00 గంటల నుండి సాయంత్రం 6:30 గంటల వరకు భక్తులకు మూసివేయబడనుంది. ఈ విషయాన్ని ఆలయ ఈవో దీప్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ శుద్ధి, పవిత్రోత్సవం నిర్వహణ కోసం తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు వివరించారు. అయితే బాల బ్రహ్మేశ్వర స్వామి దర్శనం యథావిధిగా కొనసాగుతుంది. భక్తులు మార్పును గమనించి ఆలయ నిర్వాహకులకు సహకరించాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

# పాక్-సౌదీ ఒప్పందంలో మరిన్ని దేశాలు..

**-పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యలు**
**-మా అణు సంపద సౌదీకీ ఉపయోగం**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కుదిరిన పరస్పర రక్షణ ఒప్పందంలో ఇతర అరబ్ దేశాలు కూడా చేరే అవకాశం లేకపోలేదని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తెలిపారు. అటువంటి పరిణామాలకు తలుపులు మూసుకుపోలేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఒక దేశంపై దాడి జరిగితే రెండు దేశాల మధ్య జరిగిన దాడిగా పరిగణించే పరస్పర రక్షణ ఒప్పందాన్ని పాకిస్థాన్, సౌదీ అరేబియా బుధవారం కుదుర్చుకున్నాయి. ఒకరోజు పర్యటన నిమిత్తం బుధవారం సౌదీ అరేబియాను సందర్శించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మొహమ్మద్ బీన్ సల్మాన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఖతార్‌లో హమాస్ నాయకులపై ఇజ్రాయెల్ సైనిక దాడులు జరిపిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పరస్పర రక్షణ ఒప్పందంలో మరిన్ని అరబ్ దేశాలు భాగస్వాములయ్యే అవకాశం ఉందా అన్న విలేకరుల ప్రశ్నకు తాను దీనికి ఇప్పుడే సమాధానం చెప్పలేనని, అయితే తలుపులు మాత్రం మూసుకుపోలేదని మాత్రం కచ్చితంగా చెప్పగలనని ఆసిఫ్ చెప్పారు. పాకిస్థాన్‌కు ముప్పు ఎక్కువగా ఉన్న కారణంగా ఇస్లామిక్ దేశాల మధ్య నాటో తరహా ఏర్పాటు ఉండాలని తాను మొదటినుంచి వాదిస్తున్నట్లు మంగళవారం జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ చెప్పారు. తమ ప్రాంతాన్ని, దేశాలను సమైక్యంగా పరిరక్షించుకోవలసిన ప్రాథమిక హక్కు ముస్లిం దేశాలకు, ముఖ్యంగా ముస్లిం ప్రజలకు ఉందని ఆయన తెలిపారు. ఇతర దేశాల ప్రవేశాన్ని అడ్డుకోవడం లేక మరే ఇతర దేశంతో పాకిస్థాన్ ఈ తరహా ఒప్పందం కుదుర్చుకోరాదన్న నిబంధన ఏదీ రెండు దేశాలు చేసుకున్న ఒప్పందంలో లేదని ఆయన స్పష్టం చేశారు. ఒప్పందం కింద పాకిస్థాన్ అణ్వస్త్రాలు కూడా సౌదీకి ఉపయోగపడతాయా అన్న ప్రశ్నకు తమకు ఉన్న సమస్త ఆయుధ సంపత్తి ఒప్పందం కింద సౌదీకి కూడా కచ్చితంగా అందుబాటులో ఉంటుందని ఆసిఫ్ వెల్లడించారు. తమ అణు స్థావరాలను తనిఖీ చేసుకోవచ్చని పాక్ మొదటి నుంచి ఆహ్వానిస్తోందని, తమ దేశం ఎన్నడూ ఏ తప్పు చేయలేదని ఆయన చెప్పారు. మీ రెండు దేశాలలో ఒక దేశంపై దాడి జరిగితే మరో దేశం స్పందిస్తుందా అన్న ప్రశ్నకు అందులో ఎటువంటి అనుమానం ఉండదని, తమలో ఎవరిపైన దాడి జరిగినా మరో దేశం స్పందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రవక్త జీవితాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి



**కరీంనగర్, సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న ఎక్స్‌పో -2025ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ ప్రారంభించారు. సర్కస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో విద్యార్థులు ప్రవక్త సూక్తులు, బోధనలు, మానవీయ విలువలపై వివరణాత్మకంగా వివరించారు. కుల మతాలకతీతంగా మహమ్మద్ ప్రవక్త సందేశాలను భవిష్యత్ తరాలకు అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షుడు షోహైబ్ అహ్మద్ ఖాన్, ముస్తాక్ అలీ, ఫసియోద్దీన్ నవాబ్, అబ్బాస్ సమీ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లను చోరీ చేసేవారిని కాపాడే 'ఎన్నికల కాపలాదారు' ఈసీ



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 19(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలక్షన్ కమిషన్ (ఇసి)పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 'ఓట్‌చోరీ' వ్యాఖ్యలను శుక్రవారం పునరుద్ఘాటించారు. ఓట్లను దొంగతనం చేసేవారిని ఇసి కాపాడుతోందని, 'ఎన్నికల కాపలాదారు' అని మండిపడ్డారు. 'మెలకువగా ఉండి, దొంగతనాన్ని గమనించి, దొంగలకు భద్రత కల్పించడం' వారి పని అని అన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు లేవడం, 36 సెకండ్లలో ఇద్దరు ఓటర్ల పేర్లను తొలగించడం, తిరిగి నిద్రలోకి వెళ్లడం ఈ విధంగా ఓట్ చోరీ జరుగుతోందని ఎక్స్‌లో పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో 6,018 ఓట్లను తొలగించారని, అలాగే మహారాష్ట్రలోని రాజౌరా నియోజకవర్గంలో ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి 6,850 ఓట్లను మోసపూరిత పద్ధతిలో చేర్చారని అన్నారు. అదే వ్యవస్థ పనిచేస్తోందని, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కూడా ఓట్లను తొలగిస్తోందని, దానికి సాక్ష్యాలు ఉన్నాయని అన్నారు. మీరు ఎన్నికల అధికారిగా బాధ్యతాయతంగా విధులు నిర్వహిస్తానని ప్రమాణం చేశారని, మీ విధులు సక్రమంగా నిర్వహించాలని భారతదేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కి సూచించారు. సాకులు వెతుకుతూ, తప్పించుకు తిరగడం ఆపాలని, కర్ణాటక సిఐడికి వెంటనే ఆధారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.